
సాగునీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికలు మరోసారి వాయిదా పడ్డాయి. ప్రస్తుతం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అంతా నష్ట నివారణ పనుల్లో నిమగ్నమై ఉంది. దీంతో తాత్కాలికంగా ఎన్నికల ప్రక్రియను నిలుపుదల చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 5వ తేదీన ఎన్ని కల ప్రక్రియ పునఃప్రారంభం కావాల్సి ఉంది. 14వ తేదీన ప్రాజెక్ట్ కమిటీల ఎన్నికతో ఈ ప్రక్రియ ముగియాలి. అయితే తాజాగా వాయిదా వేసిన ప్రభుత్వం తదుపరి ఎప్పుడు ప్రారంభించాలన్నది త్వరలోనే ప్రకటించనుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



అవధుల్లేని విషాదం

అవును.. మూడు కుటుంబాల్లో నెలకొన్న తీవ్ర విషాద ఘటనలు ఇవి. సంగం మండలంలో పిడుగుపాటుకు గురై ఓ రైతు మృత్యువాతపడగా, ఈయన భార్య ప్రాణాపాయస్థితిలో ఆసుపత్రిపాలైంది. ఒక నెల్లూరు శివార్లలో జరిగిన ప్రమాదంలో భర్త కళ్లెదుటే ఓ ఇల్లాలు ప్రాణాలొదిలింది. ఇక క్షణికావేశంలో భార్యనే నరికి చంపిన ఓ కసాయి భర్త ఉదంతం ఉదయగిరిలో చోటుచేసుకుంది.. మంగళవారం జరిగిన ఈ దారుణాలు ఆయా కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.

'పిడుగు' మింగేసింది!

పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు కొడుకులు.. అన్నింటా వెన్నంటి నడిచే భార్య... ఎంతో సంతోషంగా సాగిపోతున్న ఆ రైతు కుటుంబంపై 'పిడుగు' పడింది!. భార్యతో కలిసి పొలం పనులు చేస్తున్న భర్తపై పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపడిపోయాడు. పక్కనే ఉన్న భార్యకు తీవ్రగాయాలు అయ్యాయి. ఉదయం సంతోషంగా పొలం పనులకు వెళ్లిన తండ్రి తిరిగిరాని లోకాలకు చేరడం, తల్లి అపస్మారకస్థితికి చేరుకోవడంతో ఆ కొడుకుల రోదన మిన్నంటింది. సంగం మండలం మర్రిపాడులో మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదం నింపింది.



వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

సంగం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మర్రిపాడు గ్రామానికి చెందిన సీహెచ్ వెంకటేశ్వర్లు (47), ఆదిలక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు అశోక్, శ్రీనాథ్ ఉన్నారు. ఉన్న నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుని పిల్లల్ని పెంచి పోషించారు. ఈ పథ్యంలో నారు పీకేందుకు మంగళవారం ఉదయం భార్యాభర్తలిద్దరూ పొలానికి వెళ్లారు. వర్షం కురుస్తుండటంతో తలపై ప్లాస్టిక్ గూడ (కవర్) కప్పుకుని నారు పీకుతున్నారు. ఈ క్రమంలో ఉరుములు, మెరుపులతో పెద్ద శబ్దంతో వెంటేశ్వర్లు తలపై పిడుగు పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలి కిందపోయాడు. పక్కనే ఉన్న ఆదిలక్ష్మమ్మకు తీవ్రగాయాలై అస్వస్థతకు గురయ్యింది. సమీపంలో ఉన్న రైతులు గుర్తించి పరుగున అక్కడకు చేరుకుని వెంకటేశ్వర్లు, ఆదిలక్ష్మమ్మలను గట్టు మీదకు చేర్చారు. ఆ తర్వాత ఇంటికి తీసుకొచ్చారు. సమాచారం అందుకుని వచ్చిన 108 సిబ్బంది వెంకటేశ్వర్లును పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఆదిలక్ష్మమ్మను వైద్యశాలకు తరలించారు. పోస్టుమర్ట నిమిత్తం వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అస్వస్థతకు గురైన ఆదిలక్ష్మమ్మ

కట్టుకున్నోడే కడతేర్చాడు!

ఉదయగిరి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిండు నూరేళ్ల తోడుగా ఉంటానన్న భర్తే ఆమెపాలిట యముడయ్యాడు. కత్తితో విచక్షణారహితంగా పొడిచి హతమార్చాడు. మంగళవారం రాత్రి ఉదయగిరిలోని ఎస్టీ కాలనీలో ఈ దారుణం చోటుచేసుకొంది. ఎస్టీ కాలనీకి చెందిన కట్టా మస్తాన్‌కు ఇందిర (20) అలియాస్ ఇందూతో మూడేళ్ల క్రితం వివాహ మైంది. వీరికి రానా అనే ఒక కుమారుడు ఉన్నాడు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో మూడు నెలలుగా వేర్వేరుగా ఉంటున్నారు. మంగళవారం అటవీ ప్రాంతంలో మేకలు మేపుకుంటు న్న ఇందిర వద్దకు వెళ్లి మస్తాన్ వెళ్లి గొడవకు దిగాడు. అక్కడే ఉన్న స్థానికులు సర్దిచెప్పడం తో వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం ఇందిర ఇంట్లో ఉన్న కుమారుడ్ని మస్తాన్ తన తల్లి పోలమ్మ ఇంటికి తీసుకెళ్లాడు. ఎంతసేపటికి కుమారుడ్ని తీసుకురాకపోవడంతో ఇందిర, మరో మహిళ కలిసి మస్తాన్ వద్దకు వెళ్లారు. ఊయలలో ఉన్న కుమారుడ్ని తీసుకొనేందుకు ఇందిర ప్రయత్నిం చగా అప్పటికే తన వద్ద ఉన్న కత్తితో మస్తాన్ విచక్షణారహితం గా దాడి చేశాడు. తొలుత ఎడమ యదపై కత్తితో పొడవగా ఇందిర కేకలు వేస్తూ వెనక్కి తిరగడంతో మరోసారి వీపుపై రెండుమార్లు కత్తితో పొడిచాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెను వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఉదయగిరి సీఐ ఎన్.వెంకట్రావు, ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డిలు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మస్తాన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



కుమారుడు రాణాతో మస్తాన్, ఇందిర (ఫైల్)

భర్త కళ్లముందే ప్రాణాలొదిలిన భార్య

చిరుద్యోగులుగా పని చేస్తున్న ఆ భార్యాభర్తలు స్కూటీపై బయలుదేరి గమ్యస్థానాలకు చేరేందుకు 15 నిమిషాలు ప్రయాణించారు. వీరిపై మృత్యువుకు కన్ను కుట్టిందో ఏమోగానీ రోడ్డుపై గుంత రూపంలో ఇల్లాలిని పొట్టనపెట్టుకుంది. కళ్లముందే భార్య మృతి చెందడంతో ఆ యువకుడి రోదన మిన్నంటింది. నెల్లూరురూరల్ మండలం అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద మంగళవారం ఈ విషాదం చోటుచేసుకుంది.

ఘటనా స్థలిలో సుప్రజ మృతదేహం



నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి) : 2వ డివిజన్ పెద్దచెరుకూరులో ఓ అద్దె ఇంట్లో ఉంటున్న మదమంచి సుప్రజ (31) బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా చేస్తోంది. ఈమె భర్త పెంచలప్రసాద్ కొత్తూరు వద్దనున్న యూనియన్ బ్యాంకులో ఆఫీసు సబార్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. దంపతులిద్దరూ ఉద్యోగాలకు వెళ్లేందుకు ఉదయం ఇంటి వద్ద స్కూటీపై బయలుదేరారు. 15 నిమషాలపాటు ముచ్చట్లాడుతూ అల్లీపురం వద్దనున్న డంపింగ్ యార్డు వద్దకు చేరుకున్నారు. ముందు వెళ్తున్న వరిపొట్టు ట్రాక్టర్‌ను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో వీరి స్కూటీ గుంతలో పడింది. దీంతో వెనుక కూర్చొని ఉన్న సుప్రజ అదుపుకోల్పోయి పక్కకు పడటంతో ట్రాక్టర్ వెనుక టైర్లు ఆమె పైకి ఎక్కాయి. దీంతో సుప్రజ అక్కడికక్కడే మృతి చెందింది. అయినా ప్రాణాలు ఉంటాయన్న గంపెడాశతో పెంచలప్రసాద్ ఆటోలో ఎక్కించుకుని సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిని వెళ్లాడు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు తెలిపారు.

'సోమశిల'కు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి మంగళవారం 10,664 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. డ్యాం సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 70.343 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కండలేరుకు 2,000, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 150, డెల్టాకు 1,800 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

- **'గండిపాళెం'లో 14 అడుగులు**

ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి) : గండిపాళెం జలాశయంలో 14 అడుగులకు నీటి మట్టం చేరినట్లు జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం వస్తోందని తెలిపారు.



గండిపాళెం జలాశయంలో వరద నీరు

- లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 17.8 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి 230 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయగిరి ప్రాంతంలో రెండు రోజుల నుంచి కురిసిన వర్షపు నీరు బుధవారానికి ప్రాజెక్టులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

ఉద్యాన పంటలకు రాయితీలు

- **50 శాతం సబ్సిడీతో షేడ్ నెట్, పాలిహౌస్‌ల నిర్మాణం**

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్షిత వ్యవసాయ పథకం కింద షేడ్ నెట్, పాలిహౌస్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వ్యక్తిగతంగా షేడ్ నెట్ హౌస్ నిర్మాణానికి ఎకరాకు రూ.28.4 లక్షలు, పాలిహౌస్ నిర్మాణానికి రూ.37.4 లక్షలు ఖర్చవుతుండగా 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాలిహౌస్, షేడ్ నెట్‌లలో చామంతి సాగుకు ఎకరాకు రూ.8.52 లక్షలు, కీర దోస, క్యాప్సికం తదితర కాయగూరల సాగుకు ఎకరాకు రూ.2.8 లక్షలు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 799 5086780 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

దుకాణాలూ ఎంఎస్‌ఎంఈలే!

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) సర్వే కోసం రాష్ట్ర పరిశ్రమలశాఖ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సర్వే అండ్ సపోర్ట్ అనే యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. ఎంఎస్‌ఎంఈల సమస్త సమాచారాన్ని ఒకే పోర్టల్‌లో నిక్షిప్తం చేయడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఈ సర్వే ప్రారంభించింది. అన్నీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులను ఈ సర్వేలో భాగస్వాములను చేసింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంఎస్‌ఎంఈల గుర్తింపు సర్వే నవంబరు 29న ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1 వరకు ఇది కొనసాగనుంది.



దుకాణాల వద్ద సర్వే చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

- సర్వేకు ప్రభుత్వం శ్రీకారం
- సర్వే అండ్ సపోర్టు యాప్‌తో అమలు
- జిల్లాలో 18,167 ఎంఎస్‌ఎంఈలు
- 'ర్యాంప్'తో భారీగా పెరగనున్న సంఖ్య
- వివిధ శాఖల నుంచి సమాచారం
- 1,05,171 విద్యుత్ కనెక్షన్ల గుర్తింపు
- కార్మిక శాఖ, జీఎస్టీ వివరాలతోనూ పరిశీలన
- ఒకే పోర్టల్‌లోకి సమస్త సమాచారం
- వ్యాపారులకు ప్రభుత్వ చేయూత

నెల్లూరు (వెంకటేశ్వరపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటి వరకు ఎంఎస్‌ఎంఈల పరిధి తయారీ, సేవల రంగాలకే పరిమిత మైంది. అయితే కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రపంచ బ్యాంకు సహకారంతో తీసుకొచ్చిన ర్యాంప్ (రైజింగ్ అండ్ యాక్సల రేటింగ్ ఆఫ్ ఎంఎస్‌ఎంఈ పెర్ఫార్మెన్స్) పథకంతో చిన్నచిన్న వ్యాపార సంస్థలు, దుకాణాలు కూడా ఎంఎస్‌ఎంఈల కిందకు రానున్నాయి. చిన్న బంకు నుంచి ఉత్పత్తి రంగం లోని పరిశ్రమల వరకూ అన్నీ ఎంఎస్‌ఎంఈ పరిధిలోకి వస్తాయి. కాగా, జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో దాదాపు 36వేల ఎంఎస్‌ఎంఈలు ఉన్నాయి. విభజనతో గూడూరు, నాయుడుపేట, సూళ్లూరు పేట తదితర ప్రాంతాలు తిరుపతి జిల్లాకు వెళ్లిపోయాయి. దీంతో ప్రస్తుత జిల్లాలో ఎంఎస్‌ఎంఈలు 18,167 మాత్రమే ఉన్నాయి. అయితే ర్యాంప్ పథ కం అమలుతో జిల్లాలో ఎంఎస్‌ఎంఈల సంఖ్య గణనీయంగా పెరగనుంది.



పలు విధాలుగా సర్వే

ఎంఎస్‌ఎంఈల సర్వేలో సిబ్బంది పలు అంశాలను పరిగణలోకి తీసుకుంటున్నారు. వాటిలో ముఖ్యంగా విద్యుత్ కనెక్షన్ మీటర్ గ్రేడ్‌ను కూడా పరిశీలిస్తున్నారు. దాని ప్రకారం జిల్లాలో 1,05,171 వ్యాపార దుకాణాలు ఉన్నట్లు గుర్తించారు. ఇదేవిధంగా కార్మికశాఖ, జీఎస్టీ విభాగం తదితర శాఖల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగానూ సర్వే చేస్తున్నారు.

రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనం

ఎంఎస్‌ఎంఈల సర్వే ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవడం వల్ల పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా సహాయ సహకాలు అందించనున్నది. ప్రధానంగా తక్కువ వడ్డీకి బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం, విద్యుత్ బిల్లులో రాయితీ, మార్కెట్‌లో పెండింగ్ బిల్లులను 45 రోజుల్లో ఇప్పించడం, ప్రభుత్వం నిర్వహించే టెండర్లలో ప్రాధాన్యం ఇవ్వడం, మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సరుకు ఉత్పత్తి చేసేలా అవగాహన కల్పించడం వంటి చేస్తుంది. అలాగే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ ఎగిబిషన్లలో పాల్గొనేందుకు అనుమతులు మంజూరు చేస్తుంది. వీటి వల్ల వ్యాపారాన్ని విస్తరించుకునే అవకాశం కలుగుతుంది.

సర్వేతో అనేక లాభాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్‌ఎంఈల అభ్యున్నతికి అనేక కార్యక్రమా లు చేపడుతున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ పథకం ద్వారా వ్యాపార దుకాణాలను సైతం ఎంఎస్‌ఎంఈల కిందకు తీసుకురావాలని నిర్ణయించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ సర్వే చేపట్టింది. తద్వారా విద్యుత్ రాయితీలు, తక్కువ వడ్డీతో రుణాలు అందించడ వంటి అనేక ప్రయోజనాలు కల్పించనుంది. ప్రతీ ఒక్కరూ సర్వే సభ్యులకు సహకరించి పూర్తి వివరాలు అందించాలి.

- మారుతీ ప్రసాద్, పరిశ్రమల శాఖ జీఎం

ఏసీబీ వలలో ముత్తుకూరు తహసీల్దారు

- అడంగల్ 1బి సవరణకు లంచం డిమాండ్
- రూ.25వేలు తీసుకుంటూ దొరికిపోయారు

ముత్తుకూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ ముత్తుకూరు తహసీల్దారు లక్కిరెడ్డి బాలకృష్ణారెడ్డి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ శిరీష కథనం మేరకు... మండలంలోని పంటపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు వడ్లమూడి కాంతమ్మ తన భూమి రికార్డుల సవరణ కోసం విపతపత్రం ఇవ్వగా తహసీల్దారు రూ.50 వేల లంచం డిమాండ్ చేశారు. చివరకు అడంగల్ 1బీలో ఖాతా నెంబరు మార్చి సవరించి మంజూరు చేసేందుకు రూ.40 వేలు ఇవ్వాలని పట్టుబట్టారు. ఈ విషయమై ఆమె కుమారుడు వడ్లమూడి రమణయ్య నాయుడు పలుమార్లు తహసీల్దారును కలిసి ప్రాధేయపడినా నగదు ఇవ్వనిదే పని కాదని తేల్చి చెప్పారు. దీంతో రమణయ్య ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శిరీష ఆధ్వర్యంలో అధికారులు వల పన్ని రంగం సిద్ధం చేశారు. మంగళవారం మధ్యాహ్నం తహసీల్దారు బాలకృష్ణారెడ్డి తన కార్యాలయంలో ఉండగా రమణయ్య ఆయన వద్దకు వెళ్లారు. తహసీ ల్దారుకు రూ.25వేల నగదు ఇస్తుండగా ఏసీబీ బృందం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. వెంటనే ఆయనకు రసాయన పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. నగదును స్వాధీనం చేసుకొని బాలకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. కార్యాల యంలో సిబ్బంది వద్ద, వెలుపల వాహనాల్లోనూ ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు.



లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ తహసీల్దారు బాలకృష్ణారెడ్డి, పక్కనే నగదు



బాధిత రైతు వడ్లమూడి రమణయ్య

- **లంచం అడిగితే ఫోన్ చేయండి**

ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ కాల్ సెంటర్ నెంబర్ 9440440057, తన నెంబరు 9440446184కు ఫోన్ చేయాలని ఏసీబీ డీఎస్పీ శిరీష కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

- **గతంలోనూ..**

ఏసీబీ అధికారులకు తహసీల్దారు పట్టుబడటం ముత్తుకూరులో సంచలనం రేపింది. పంటపాలెంకు చెందిన వడ్లమూడి రమణయ్య గతంలో 2011లో అప్పటి ముత్తుకూరు పశువైద్యాధికారి ఇందిరారెడ్డి రుణమంజూరు విషయంలో అనుమతి కోసం లంచం అడుగుతున్నారని ఫిర్యాదు చేసి ఏసీబీకి ఆమెను పట్టించారు. ప్రస్తుతం అదే రమణయ్య తహసీల్దారు బాలకృష్ణారెడ్డిని ఏసీబీ అధికారులకు పట్టించారు.

వంటింట దీపం వెలుగులు

- 2,23,903 మంది అర్హులకు రూ.17.02 కోట్ల సబ్సిడీ జమ
- ఈకేవైసీ కానివారికి ఆలస్యంగా నగదు
- లబ్ధిదారుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన దీపం-2 ఉచిత గ్యాస్ పథకం పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. సూపర్ సిక్స్‌లో భాగంగా అక్టోబరు 31న ఈ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. తొలుత సిలిండర్‌ను రూ.840లకు కొనుగోలు చేయాలి. ఆ తర్వాత కేంద్రం ప్రభుత్వం ఇస్తున్న రూ.18.74 సబ్సిడీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. 2, 3 రోజుల అనంతరం మిగిలిన సబ్సిడీ నగదు రూ.822 బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. అయితే కొందరికి ఈ సబ్సిడీ నగదు జమ కాకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. అధికారులను ప్రశ్నిస్తే 1967 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేస్తే కారణాలు తెలుస్తాయని చెబుతున్నారు. అయితే, ఆ నెంబరుకు ఫోన్ చేస్తే స్పందనే ఉండటం లేదు.

- **ఈకేవైసీ తప్పనిసరి**

ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందాలంటే ఈకేవైసీ తప్పనిసరి. సాధారణంగా ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ తీసుకునే సమయంలో ఆధార్ లింకు చేయాలి. ఆధార్ లింక్ చేసిన బ్యాంకు ఖాతాతో గ్యాస్ కనెక్షన్‌ను అనుసంధానం చేయాలి. ఈ మొత్తం ప్రక్రియను ఈకేవైసీ అంటారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈకేవైసీని ఆయిల్ సంస్థలు అప్‌డేట్ చేసుకుంటూ ఉండాలని అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై అవగాహన లేక చాలా మంది ఈకేవైసీని నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు ఈకేవైసీ ఉంటేనే సబ్సిడీ నగదు అందుతుండటంతో అందరూ డీలర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇస్తున్న సంవత్సరానికి మూడు సిలిండర్లకు అర్హత పొందాలంటే రేషన్ కార్డు, ఈకేవైసీ చేయించుకుని ఉండాలి. ఈ రెండింటిలో ఏది లేకపోయినా ఆ పథకానికి అనర్హుడిగా ప్రకటిస్తారు.



- **2,37,440 మందికి సబ్సిడీ**

జిల్లాలో 7,33,520 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో దీపం-2 పథకానికి 4.06 లక్షల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. వీరిలో ఇప్పటి వరకు 2,23,903 మంది ఉచిత గ్యాస్ సబ్సిడీ అందింది. రూ.17.02 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యింది. 13,537 మందికి సబ్సిడీ జమ కావాల్సి ఉంది. ఈకేవైసీ, ఇతర నిబంధనలకు అనుగుణంగా సిలిండర్ తీసుకున్న 48 గంటల్లోనే లబ్ధి ఖాతాల్లో నగదు జమ అయ్యింది. గ్యాస్ కనెక్షన్లు కలిగిన వారంతా ఈకేవైసీ చేయించుకుంటే మరి కొంతమంది అర్హులుగా తేలే అవకాశం ఉంది.

- గ్యాస్ సిలిండర్ కోసం నమోదు

- మిగతా 6లో



కందుకూరు ప్రాంతంలో నీటమునిగిన వరినారును చూపుతున్న రైతు

'ఫెంగల్' నష్టం అపారం

- ఎడతెరిపిలేని వర్షంతో అన్నదాత కుదేలు
- 2,442 హెక్టార్లలో దెబ్బతిన్న సాగు
- కొనసాగుతున్న నష్ట అంచనాలు

నెల్లూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ జిల్లాకు తీరని నష్టాన్ని మిగిల్చింది. నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. ప్రధానంగా సాగుకు సిద్ధమైన రైతాంగంపై తుఫాన్ ప్రభావం తీవ్రంగా పడింది. ప్రస్తుతం చాలా చోట్ల వరి విత్తనాలు పోసుకుంటుంగా, ఇంకొన్నిచోట్ల నాట్లు వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. భారీ వర్షాలకు విత్తనాలు, నాట్లు నీట మునిగాయి. జిల్లాలో 2442 హెక్టార్లలో (సుమారు 6100 ఎకరాలు) సాగు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. అందులో 264 హెక్టార్లలో అప్పుడే పోసుకున్న విత్తనాలు దెబ్బతినగా, మరో 1,491 హెక్టార్లలో నాట్లు వేసుకున్నాక దెబ్బతిన్నది. అలానే వేరుశనగ 50 హెక్టార్లలో, మినుము 57 హెక్టార్లలో, కంది 10 హెక్టార్లలో, శనగ 570 హెక్టార్లలో నీట మునిగింది. ఇప్పటివరకూ వేసిన అంచనా ప్రకారం 21 మండలాల్లోని 151 గ్రామాల్లో పంట నష్టం జరగ్గా, 2,420 మంది రైతులు నష్టపోయారు. వర్షాలు ఇంకా కొనసాగుతుండటంతో పూర్తి నష్టాన్ని అంచనా వేసేందుకు మరికొంత సమయం పడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా తుఫాన్ ప్రభావంతో పలు చోట్ల రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు చాలా వరకూ సర్ఫేస్ ధ్వంసమైంది. ఈ రోడ్లకు ప్యాచ్‌లు వేయాల్సి ఉంది. వర్షాలు కురుస్తుండటంతో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడం సాధ్యపడడం లేదు.

- **'ఇరిగేషన్'కు అపార నష్టం**

అదే సమయంలో ఇరిగేషన్ శాఖకు కూడా భారీగా నష్టం జరిగింది. ఒక్క వెంకటగిరి డివిజన్‌లోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల్లో సుమారు రూ.4 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. మిగిలిన డివిజన్లకు సంబంధించి నష్ట అంచనా ప్రక్రియ జరుగుతోంది. కాగా ఫెంగల్ తుఫాన్ తీరం దాటి రెండు రోజులు గడిచినా ఇంకా జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టడం లేదు. మంగళవారం కూడా ఉదయం ఎండ వచ్చినట్టు వచ్చి మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. సాయంత్రం వరకూ విడతల వారీగా భారీ వర్షం కురిసింది.

- **22.6 మి.మీ వర్షం**

మంగళవారం జిల్లాలో సరాసరి 22.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సీతారామపురంలో 69.2 మి.మీ, ఉదయగిరిలో 55.4 మి.మీ, సంగంలో 42.4 మి.మీ, వరికుంటపాడులో 41.8 మి.మీ, దుత్తలూరులో 40 మి.మీ, అనంతసాగరంలో 44.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది. బుధవారం కూడా కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సోమశిల, కండలేరు, గండిపాళెం, రాళ్లపాడు తదితర జలాశయాలకు వరద కొనసాగుతోంది.

వెట్టిచాకిరీ నిర్మూలన కమిటీకి
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 : జిల్లాలో వెట్టిచాకిరి నిర్మూలన కమిటీ ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నివసించే ముగ్గురు ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన సామాజిక కార్యకర్తలు, ఇద్దరు డీఆర్డీఏకు చెందిన వారిని కమిటీలో నియమిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు బుధవారం నుంచి కార్యాలయ పనివేళల్లో దరఖాస్తులు అందచేయాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి అనేక పథకాలు

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ
- ఘనంగా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. మంగళ వారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అరుణమ్మ మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో సమానంగా, గౌరవంగా జీవించేందుకు సమాన అవకాశాలు పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్ర భుత్వాలు కృషి చేస్తున్నాయ న్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులందరికీ మనోధైర్యం, స్ఫూర్తి కలిగించ డమే దివ్యాంగుల దినోత్సవ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.6వేలు పింఛను, ట్రైసైకిళ్లు, వాహనాలు, పరికరాలు అందిస్తోందని చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి కే వాణి మాట్లాడుతూ దివ్యాంగులు కూడా అందరితో సమానంగా జీవించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు ప్రభుత్వమే ఉచితంగా వైద్య బీమా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఏడీ వినీల్‌కుమార్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న ఆనం అరుణమ్మ, చిత్రంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి, న్యాయాధికారి వాణి తదితరులు

గురుకులంలో మంత్రి ఆకస్మిక తనిఖీ

విద్యార్థులూ... బాగా చదవాలి

మంత్రి బాలవీరాంజనేయ స్వామి

బిట్రగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) బోగోలు మండలం కప్పరాళ్ళతిప్ప వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను, గ్రామ సచివాలయాలను సాంఘిక, సంక్షేమ శాఖమంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులానికి వచ్చిన ఆయన ప్రిన్సిపాల్ పద్మజతో కలసి బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు, నీటివసతి, విద్యార్థుల విశ్రాంతి గదులను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలోని మురుగుగుంట , పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డైనింగ్ హాలో విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. సమావేశ ప్రాంగణంలో వారితో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు టీడీపీ ప్రభుత్వం పలు వసతులు కల్పిస్తుందని తెలిపారు. బాగా చదువుకుని తల్లితండ్రులకు, దేశానికి మంచిపేరు తీసుకురావాలని విద్యార్థి నులను ఆయన కోరారు. ఇటీవల ఓ విద్యార్థిని పాము కాటుకు గురైన విషయంపై ప్రిన్సిపాల్‌తో చర్చించారు. వెంటనే స్పందించిన ఉపాధ్యాయు లు, చికిత్స తరలించిన ఎస్‌ఐ బోజ్యా సిబ్బందిని మంత్రి అభినందించారు. టీడీపీ మండల దివ్యాంగుల సంఘం నేత యూ. రవికి మంత్రి ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట రూరల్ సీఐ పాపారావు, టీడీపీ నేతలు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లురెడ్డి, సుధీర్‌బాబు, ప్రభాకర్, ఎహెజ్కేల్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి బాలవీరాంజనేయస్వామి

సమస్యల సంద్రంలో టిడ్కో ఇళ్ల సముదాయం

చెత్తకుప్పలు.. మురుగు కంపు!

ఎటు చూసినా చెత్తకుప్పలు.. మురుగు ప్రవాహం... విచ్చలవిడిగా పెరిగిన పిచ్చిమొక్కలు.. పందుల స్వైరవిహారం టిడ్కో ఇళ్ల సముదాయంలో ఉన్న సమస్యలివి. నెల్లూరు శివార్లలోని వెంకటేశ్వరపురంలో దాదాపు 4800 ఇళ్ల సముదాయం ఉండగా, దాదాపు 70శాతం ప్రజలు అక్కడ నివాసం ఉంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో అభివృద్ధి మాట అటుంచితే, కనీసం చెత్త ఎత్తే నాథుడే కరువయ్యారు. మురుగునీటి ప్రవాహానికి కాలువలు లేకపోవడంతో రోడ్లపైనే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. విచ్చిలవిడిగా చెట్లు పెరిగిపోవడంతో విషపురుగుల బెడద ఎక్కువయ్యిందని నిర్వాసితులు వాపోతున్నారు. దీనికితోడు ఆకతాయిలు, దొంగలు చొరబడి చోరీలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టిడ్కో ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)



డ్రైనేజీ పైపుల లీకేజీతో..



నివాసాల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు



టిడ్కో ఇళ్ల వద్ద చెత్తా చెదారం



ఈ ప్రాంతం బాలలకు సురక్షితమేనా!?



రోడ్డుపైనే మురుగు నిల్వ

- నేలకొరిగిన వరి, కంది పైర్లు
- మినుము, శనగ పంటల్లో నీటి నిల్వ
- నీట మునిగిన వరినాట్లు
- లబోదిబోమంటున్న రైతన్నలు

వర్షం.. అపార నష్టం!

ఉదయగిరి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కర్షకులు కలవరం చెందుతున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు, రబీ సీజన్‌లో ముందస్తుగా వేసిన పంటలు దెబ్బతింటున్నాయి. ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు, దుత్తలూరు, మర్రిపాడు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి కోత దశకు వచ్చింది. ఈ తరుణంలో కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో వరి నేలకొరిగింది. అలాగే పూత, పిందె దశల్లో ఉన్న మినుము, కంది పంటలో నీరు చేరడంతో పంట దెబ్బతినే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలానే కురిస్తే నేలకొరిగిన ఆయా పంటల గింజ మొలకెత్తి తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. దుత్తలూరు మండలంలో ఇటీవల 330 హెక్టార్లలో పచ్చిశనగ సాగు చేయగా, చేలల్లో నీరు చేరడంతో పంట దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయాధికారి వెంకటసుబ్బారెడ్డి తోటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.



ఉదయగిరి రూరల్ : వర్షాలకు నేలకొరిగిన వరి పంట



ఉదయగిరి రూరల్ : మినుము పంటలో చేరిన వర్షపు నీరు

నీటమునిగిన వరినాట్లు.

మనుబోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురవడంతో సర్వేపల్లి నియోజకవర్గంలో 2వేల ఎకరాల్లో వరినాట్లు, 500ఎకరాల్లో నారుమళ్ళు నీటమునిగాయి. త్వరలోనే మరో అల్పపీడనం ఉందన్న ప్రచారం జరుగుతుండ టంతో అన్నదాతల్లో కలవరం మొద లైంది. పొదలకూరులో వెయ్యి ఎకరాల్లో వరినాట్లు, 2వేల ఎకరాల్లో నారుమళ్లు, 10ఎకరాల్లో కంది పంట నీటమునిగింది. తోటపల్లి గూడూరు లో 400ఎకరాల్లో వరినాట్లు, 200 ఎకరాల్లో నారుమళ్ళు మనుబోలులో 100ఎకరాల్లో వరి నాట్లు, 50ఎకరాల్లో నారుమళ్ళు, ముత్తుకూరులో 50 ఎకరాల్లో వరినాట్లు, వెంకటాచలంలో 15 ఎకరాల్లో వరినాట్లు నీటమునిగినట్లు వ్యవసాయ అధికారులు తేల్చారు. రెండు రోజులుగా మండలాల్లో వ్యవసాయాధికారులు నీట మునిగిన నారు మళ్ళు, వరినాట్లను పరిశీలించి రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు.

● కోవూరు (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గ పరిధిలోని పంట పొలాల్లో వరినాట్లు నీట మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు. కోవూరు మండలంలోని పాటూరు, పోతిరెడ్డిపాళెం, కోవూరు, ఇనమడుగు, విడవలూరు మండలంలోని విడవలూరు, పార్లపల్లి, వావిళ్ళ, కొడవలూరు మండలంలోని వెంకన్నపాళెం, దామేగుంట , బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రేబాల, దామరమడుగు పరిసర ప్రాంతాల్లో వరినాట్లు నీటమునిగాయి. ఎక్కువ కాలం నీటిలో మునిగి ఉంటే నాట్లు పాచిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోవూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో నీటమునిగిన పొలాలను కృషి విజ్ఞానకేంద్రం, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

20 ఎకరాలలో నష్టం



వలేటివారిపాలెం సమీపంలో 20 ఎకరాల్లో పొగనాట్లు వేశా ను. నాణ్యమైన దిగుబడి వస్తుందను కుంటున్న దశలో ఈ వర్షంతో ఏపుగా పెరిగిన తోటలో జిగురు పూర్తిగా కారిపోయింది. మరో రెండు రెలుపులు నాణ్యత దెబ్బతినడమేగాక ఆకు తేలికగా మారి బరువు తగ్గిపోతుంది. దీంతో కనిపించని నష్టం జరుగుతుంది. నా ఒక్కడిదే కాదు తేలికనేలల్లో పొగాకు సాగుచేసిన ముదురు తోటల రైతులు అందరి పరిస్థితీ ఇదే.

- కట్టా హనుమంతరావు, పొగాకు రైతు, వలేటివారిపాలెం

3 ఎకరాల్లో నాట్లు మునిగిపోయాయి



చాగొల్లు పెద్ద చెరువు అలుగు ఉధృతంగా పారడంతో వరినాట్లు నీటమునిగి పోయాయి. ఈ వరద మరో మూడు నాలుగురోజులు తగ్గే పరిస్థితి లేనందున పూర్తిగా నాట్లు కుళ్లిపోతాయి. నాట్లు వేయటానికి ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేశాను. అయితే చెరువులు నిండినందున మళ్లీ నాట్లు వేసుకునే అవకాశం ఉన్నా మళ్లీ పెట్టుబడి పెట్టాలి. నారు సంపాదించడం కష్టం. ముదురు పైరు అయితే చివర్లో కూడా నీటి ఎద్దడి లేకుండా మంచి దిగుబడి సాధించుకునేవాళ్లం.

- కారుసాల శ్రీనివాసులు, వరి రైతు, చాగొల్లు, ఉలవపాడు మండలం

కందుకూరు కర్షకుడికి కొంత మోదం - కొంత ఖేదం

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుపాను కందుకూరు ప్రాంత రైతులకు కొంత మోదం కొంత ఖేదం మిగిల్చింది. గత ఏడేళ్లుగా నిండని చెరువులు జలకళను సంతరించుకోగా భారీ వర్షాల కారణంగా మినుము, వరి సాగు చేసిన రైతులకు నష్టం వాటిల్లింది. ముదురు పొగతోటలకు కూడా ఈ వర్షం కనిపించని నష్టం చేయగా లేత తోటల పరిస్థితి వాతావరణం తెరపిస్తే కానీ అర్థం కాదని రైతులు చెబుతున్నారు.

చెరువులకు జలకళ

కందుకూరు సబ్ డివిజన్‌లో ప్రధాన నీటి వనరులుగా ఉన్న రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో ఈ వర్షంతో వరినాట్లకి రైతులు సిద్ధపడుతుండగా కందుకూరు మండలంలో అత్తాకోడళ్ల చెరువులుగా ప్రసిద్ధి చెందిన మోపాడు, మాచవరం చెరువులు నిండుతున్నాయి. అలాగే కరేడు ఆనకట్ట సిస్టమ్ పరిధిలో ఉన్న కరేడు, చాకిచర్ల చెరువులు పూర్తిస్థాయిలో నిండగా ఉలవపాడు, గుడ్లూరు మండలాల్లో ఎల్‌యూ సప్లై ఛానల్ పరిధిలో ఉన్న చెరువులు, ఇతరత్రా నీటివనరుల ఆధారంగా ఉన్న చెరువులు కూడా నిండుతున్నాయి. వలేటివారి పాలెం, లింగసముద్రం మండలాల్లోని జలవనరులకు 80 శాతం మేర నీరు చేరింది. కందుకూరు సబ్ డివిజన్‌లో ఏడేళ్ల తర్వాత రైతులు అన్ని చెరువుల కింద వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు.



ఉలవపాడు : చాకిచర్లలో నీటమునిగిన వరినాట్లు

పంట నష్టం అపారం

ఇక వర్షాల కారణంగా పంటలకు అపార నష్టం వాటిల్లింది. గత నెల ద్వితీయార్థంలో కురిసిన భారీ వర్షాలతో మినుము చేలల్లో నీరు నిలిచి అధికతేమ, అదుపులోకి రాని దోమ కారణంగా పల్లాకు తెగులు సోకింది. దీంతో పూత, పిందె పూర్తిగా రాలిపోగా నష్టనివారణ చర్యలు చేపట్టేలోగా ఫెంగల్ ప్రభావంతో మళ్లీ వర్షాలు కురవటంతో మినుము పొలాలు ఎక్కడా చూసినా పండిపోయి దర్శనమిస్తున్నాయి. ఇక ఎన్ని మందులు స్ప్రేచేసినా ప్రయోజనం లేదని మినుమును వదిలేసుకోవటమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి రూ.20వేలకుపైగా పెట్టుబడి పెట్టామని ఒక్క రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఉలవపాడు మండలం చాగొల్లు, చాకిచర్ల గ్రామాల పరిధిలో 500 ఎకరాలలో వరినాట్లు నీటమునిగాయి. కందుకూరు మండలంలోనూ వరినాట్లు దెబ్బతినగా రాళ్లపాడు రిజర్వాయరు ఆయకట్టులో వరినారుమడులు దెబ్బతిన్నాయి. ముదురు పొగతోటల రైతులకూ ఈ వర్షం నష్టం చేకూర్చింది. తేలికనేలల్లో సాగుచేసిన పొగతోటలు ప్రస్తుతం రెలుపుల దశలో ఉండగా ఈ వర్షంతో కనీసం రెండు రెలుపులు నాణ్యత లేని ఆకు వస్తుందని దీంతో కనిపించని నష్టం జరుగుతుందని రైతులు చెబుతున్నారు. లేత పొగనాట్లు ఏమేరకు దెబ్బతింటాయనేది ఎండకాస్తే తప్ప అర్థం కాదని తెలిపారు.



కందుకూరు ప్రాంతంలో నీళ్లలో ఉన్న లేత పొగనాట్లు

దీపం వెలుగులు

(5వ పేజీ తరువాయి)

చేసుకున్న వారంతా మొదట పూర్తి ధరను చెల్లించి సిలిండర్‌ను తీసుకోవాలి. ఆ తరువాత అర్హులైన వారికి బ్యాంకు ఖాతాలకు సబ్సిడీ నగదు జమ అవుతుంది.

● ఉచిత గ్యాస్ పొందాలంటే రేషన్‌కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ తప్పనిసరిగా ఉండాలి

● ఒక వ్యక్తి రెండు కంపెనీల నుంచి గ్యాస్ కనెక్షన్ పొంది ఉన్నా, అర్హుడైతే ఒక కంపెనీ నుంచి ఉచిత గ్యాస్ సబ్సిడీ అందుతుంది.

● కుటుంబసభ్యుల్లో ఎవరి పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉందో ఆ వ్యక్తి పేరు రేషన్‌కార్డులో ఉంటేనే రాయితీ వస్తుంది.

● భార్య పేరుతో రేషన్ కార్డు, భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే. ఒక రేషన్ కార్డులోని సభ్యుల పేర్లతో రెండు, మూడు కనెక్షన్లు ఉంటే రాయితీ ఒక కనెక్షన్‌కే వర్తిస్తుంది.

1967కు ఫోన్ చేయాలి

గ్యాస్ కనెక్షన్లు కలిగి ఉన్న వారికి సబ్సిడీ బ్యాంకులో జమకాకపోతే 1967 నెంబరుకు ఫోన్ చేయాలి. ఎందుకు సబ్సిడీ రాలేదో తెలుస్తుంది. మొదటి ఉచిత సిలిండర్‌ను వచ్చే ఏడాది మార్చి ఆఖరులోగా పొందే అవకాశం ఉన్నందున తొందర పడకుండా ఈకేవైసీ చేయించుకోవాలి. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్ దగ్గర కూడా ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటు ఉంది.

- డీవీ రమణ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

నేడు ఘంటసాల జయంతి

నెల్లూరు (సాంస్కృతికం) (ఆంధ్రజ్యోతి) : కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సుబేదారుపేటలో జరుగుతాయని కేతా సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గాయకుడు పాటూరి శ్రీనివాసులును సత్కరిస్తామని పేర్కొన్నారు.

అమ్మానాన్నలకు ఆహ్వానం



అనంతసాగరం మండలం చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతి విషయంలో భిన్నత్వం చూపుతారు. ముఖ్యమైన రోజులు, ప్రముఖుల జయంతి కార్యక్రమా లు నిర్వహించడంతో పాటు వారి జీవిత చరిత్రను ఆలింగనం చేసుకోవడంలో శ్రద్ధ చూపుతారు. వారికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం కూడా అదే రీతిలో ఉంటుంది. ఈనెల 7న పాఠశాలలో జరిగే ప్రత్యేక కార్యక్రమం (తల్లిదండ్రుల సమావేశం)కు హాజరు కావాలని కోరుతూ విద్యార్థులు మంగళవారం వినూత్నంగా వారి తల్లిదండ్రులకు లేఖలు రాయడం ఆకర్షణగా నిలిచింది.

- అనంతసాగరం,(ఆంధ్రజ్యోతి)

రోడ్లపై మడుగు.. ముందుకు పడని అడుగు!



చిన్నపాటి వర్షానికే రహదారులపై వర్షపునీరు నిల్వ చేరుతుండడంతో పాదచారులు, వాహనదారులు అవస్థ లు పడుతున్నారు. పట్టణంలోని గండిపాళెం ప్రధాన రోడ్డు, బాలాజీనగర్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రహదారులపై నీరు నిల్వ చేరి మడుగులా తయారైంది. దీంతో అడుగు ముందుకు వేయాలంటే కుదర డంలేదు. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

-ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

పాతదని పట్టించుకోకుంటే ఎలా...?

వింజమూరు పట్టణ నడిబొడ్డున ఉన్న పాత ప్రభుత్వాసుపత్రి శిథిలావస్థకు చేరుకుంది. గతంలో ఈ హాస్పిటల్ వృద్ధులకు, పిల్లలకు అందుబాటులో ఉండేది. ఊరికి దూరంగా మార్చాక ఇప్పుడు కష్టం కలుగుతుందని వారు తెలిపారు. పాత హాస్పిటల్‌లో ఓపీని ఏర్పాటు చేయాలని, దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇలా వదిలివేయడం వలన విష సర్పాలు, అసాంఘిక కార్యక్రమాలు జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. వేరే ప్రభుత్వ శాఖలకైనా ఈ భవనాలను వినియోగించాలం టున్నారు.

- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



మహిళ ఆత్మహత్యాయత్నంపై
తహసీల్దారు విచారణ

సమస్య పరిష్కారమయ్యే వరకు పొలంలోకి ఎవరూ దిగొద్దు

మనుబోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లికి చెందిన తుమ్మల హైమావతి సోమవారం కలెక్టరేట్‌లో ఆత్మాహత్యాయత్నానికి ప్రయత్నించిన విషయం విదితమే. దీనిపై విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించడంతో తహసీల్దారు సీహెచ్, సుబ్బయ్య మంగళవారం వీరంపల్లి సచివాలయంలో విచారణ చేపట్టారు. హైమావతి తన కున్న పొలం పక్కనే తనమామకు చెందిన 0-57 సెంట్ల పొలం ఉందని, ఆ భూమి పత్రాలు ఉన్నాయని, అయితే ఆ భూమి తనదంటూ వీరంపల్లికి చెందిన గోనె ప్రభాకర్ ఆక్ర మించుకుంటున్నాడని తహసీల్దారు ఎదుట వాపోయింది. ఈ సమస్యపై గతంలో పలుమార్లు రెవెన్యూ అధికారులకు, పోలీ సులకు చెప్పినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. అక్కడా పరిష్కారం కాకపోతే ఆత్మాహత్యా యత్నంకు ప్రయత్నించబోయానని ఆమె తహసీ ల్దార్‌కు వివరింఆరు. అయితే గోనె ప్రభాకర్ ఆ భూమి తమదని, తనకు పట్టాలు ఉన్నాయని తెలిపారు. ఇరువురి వాదనలు విన్న తహసీల్దారు రికార్డులు పరిశీలించి, విచారణ పూర్త య్యే వరకు ఆ భూమిలో ఎవరూ దిగవద్దని హెచ్చరించారు.



వీరంపల్లి సచివాలయంలో విచారణ చేస్తున్న తహసీల్దారు సుబ్బయ్య

ప్రభుత్వ కార్యాలయాల్లో
వసూల్ రాజాలు

- పైసలిస్తేనే పనులు.. కాదంటే ఫైలే కదలదు!
- కాళ్లరిగేలా తిరుగుతున్న బాధితులు
- చివరికి విసిగిపోయి ఏసీబీని ఆశ్రయిస్తున్న వైనం
- పక్కావ్యూహంతో దొరికిపోతున్న లంచగొండులు
- అయినా, జంకని అధికారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలు అవినీతి, అక్రమాలకు నిలయాలుగా మారుతున్నాయి. రెవెన్యూ, పంచాయతీ రాజ్, సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, మున్సిపల్ తదితర కార్యాలయాల్లో పనులు కావాలంటే అధికారులు, ఉద్యోగుల చేయి తడపాల్సిందేనంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ప్రత్యేకించి రెవెన్యూ శాఖలో పొలానికి సంబంధించి ఆన్‌లైన్‌లో చేర్పులు, మార్పులు, మ్యుటేషన్, పాసుపుస్తకాల మంజూరు, ఇతరత్రా సమస్యల పరిష్కారం కోసం పత్రాలన్నీ సక్రమంగా అందజేసినా సకాలంలో వాటికి పరిష్కారం చూపని పరిస్థితి నెలకొంది. దరఖాస్తుదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. ఇక పంచాయతీరాజ్, సబ్ ట్రెజరీ, మున్సిపల్ కార్యాలయాల్లో బిల్లులు మంజూరుకు నేరుగా లంచం డిమాండ్ చేస్తున్నారు. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దోపిడీ చెప్పాల్సిన అవసరం లేదు. ఇదంతా మండల, జిల్లాస్థాయి అధికారులకు తెలిసినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వారికి కూడా నెల మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కాళ్లరిగేలా తిరిగినా పని కాకపోవడం, లంచం డిమాండ్ చేస్తుండటంతో విసిగివేశారిన ప్రజలు చివరకు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయిస్తున్నారు. పక్కా ప్రణాళికతో వారు వేసే ఉచ్చులో లంచగొండి అధికారులు పడిపోతున్నారు. ఇటీవల ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవో, తాజా ముత్తుకూరు తహసీల్దారు ఏసీబీకి పట్టుబడ్డారు.

- 2022, సెప్టెంబరులో సీతారామపురం మండలం అయ్యవారిపల్లికి చెందిన అంకయ్య అనే రైతు మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకొని తహసీల్దారు సతీష్‌కుమార్‌ను సంప్రదించారు. ఆయన లంచం డిమాండ్ చేయడంతో అంకయ్య ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. తహసీల్దారుకు ఆయన ఇంట్లోనే లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు.
- 2023, మే నెలలో దుత్తలూరు మండలం సోమలరేగడకు చెందిన వంగూరు రాధాకృష్ణారెడ్డి మ్యుటేషన్ కోసం మూడుసార్లు దరఖాస్తు చేసుకొన్నాడు. ఎలాంటి కారణం చెప్పకుండా వీఆర్వో దరఖాస్తులను తిరస్కరించి లంచం డిమాండ్ చేశాడు. చేసేది లేక బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించడంతో చాకచక్యంగా పట్టుకొన్నారు.
- 2023, జులైలో చేజర్ల మండలం కొలపనాయుడు పల్లికి చెందిన జీ.శ్రీనివాసులు అనే రైతు తమ పెద్దల నుంచి సంక్రమించిన ఇంటి స్థలానికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని వీఆర్వో రాజాను కోరారు. ఇందుకు రూ.10 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో సదరు రైతు 1902 కాల్ చేయగా బాధితుడిని ఏసీబీ అధికారులు రహస్యంగా సంప్రదించారు. వీఆర్వోకు రైతు నగదు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు.
- ఐదేళ్ల క్రితం ఉదయగిరి సబ్ రిజిస్ట్రార్ ఓ రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దుత్తలూరు సమీపంలో రిజిస్ట్రార్‌కు నగదు ఇస్తుం డగా ఏసీబీ బృందం దాడులు చేసి పట్టుకుంది.
- ఆరేళ్ల క్రితం ఉదయగిరిలో ఓ కాంట్రా క్టర్‌కు బిల్లు మంజూరు కోసం పంచాయతీ రాజ్ ఏఈ లంచం డిమాండ్ చేశారు. పట్టణంలోని ఏఈ నివాసంలో కాంట్రాక్టర్ నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు.



దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వో, నగదుతో ఏసీబీ అధికారులు(ఫైల్)

- గతనెల 19వ తేదీన ఉదయగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్టీవో సీహెచ్ మమత అరియర్స్ బిల్లు మంజూరు కోసం ఓ ఉపాధ్యాయుడి వద్ద రూ.46 వేలు లంచం డిమాండ్ చేసింది. ఆ ఉపాధ్యాయుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కార్యాలయంలోని ఓ ప్రైవేటు వ్యక్తికి రూ.40 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకొన్నారు.
- తాజాగా ముత్తుకూరు తహసీల్దారు బాలకృష్ణారెడ్డి ఓ రైతు వద్ద నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు.

ఇలా ఏసీబీ అధికారులు దాడులు చేస్తున్నా ప్రభుత్వ అధికారులు, సిబ్బందిలో మాత్రం మార్పు రావడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు, ఉద్యోగులపై ప్రత్యేక నిఘా ఉంచి శాఖాపరమైన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పోలీసు క్రీడాకారులకు ఎస్పీ అభినందన



పతకాలు సాధించిన పోలీసులతో ఎస్పీ, అధికారులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇం డియా పెన్‌కాక్ సిలాట్ చాంపియన్ షిప్-2024లో రెండవ, మూడవ బహుమ తులు సాధించిన పోలీసు సిబ్బంది చరణ్ తేజ, రాజశేఖర్, 25వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ మీట్‌లో మూడవ బహుమతి పొందిన పుల్లయ్యను ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం అభినందించారు. కాగా, నవంబరు 19 నుంచి 21 వరకు శ్రీనగర్‌లోని ఇండో ర్ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన పెన్‌కాక్ సిలాట్ చాంపియన్‌షిప్‌లో అండర్-95 విభాగంలో చరణ్‌తేజ రజతం, అండర్-110 విభాగంలో రాజశేఖర్ కాంస్య పతకం సాధించారు.

డీఎడ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : డీఎల్ఈడీ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొపారు. ఫలితాలకు సంబంధించిన మార్కుల జాబితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో అందుబాటులో ఉన్నాయన్నారు. రీ కౌంటింగ్ కోరుకునే వారు ఈనెల 7వతేదీలోపు ఒక సబ్జెక్ట్‌కు రూ.500ల వంతున సీఎఫ్ఎంఎస్ ద్వారా చలానా కట్టి ప్రభుత్వ పరీక్షల కార్యాలయానికి దరఖాస్తు పంపించాలని తెలిపారు.

కష్టంగా కాదు ఇష్టంగా చదవాలి : యండమూరి



యండమూరిని సత్కరిస్తున్న జేసీ కార్తీక్, వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు, వినోద్ ఫౌండేషన్ నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పాఠ్యాంశాలపై ఆసక్తి చూపాలని కష్టంగా కాక ఇష్టంగా చదవాలని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ సూచించారు. వినోద్ ఫౌండేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు టౌను హాల్‌లో మంగళవారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. యండమూరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. బతికున్న తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో వదిలేస్తున్న రోజుల్లో చనిపోయిన తన తమ్ముడు వినోద్ పేరు మీద ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్న మనపాటి చక్రవర్తిని అభినందించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానం చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే కార్తీక్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య విజయభాస్కర్‌రావు, ఐఆర్ఎస్ అధికారి శైలేంద్రబాబు, డాక్టర్ సుధీర్, ఏపీజేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్‌బాబు, వినోద్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవరస కూచిపూడి నాట్య కళాక్షేత్రం వారి ప్రదర్శన ఆకట్టుకుంది.

ప్రశాంత రైల్వే ఎన్నికలకు సహకరించండి

బిట్రగుంట (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ట్రేడ్ యూనియన్ల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రెండు యూనియన్ల నాయకులు సహకరించాలని బిట్రగుంట రైల్వే ఆర్పీఎఫ్ ఎస్ఐ మహేంద్రబాబు కోరారు. బిట్ర గుంట ఆర్పీఎఫ్ కార్యాలయంలో బిట్రగుంట సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ నాయ కులతో మంగళవారం ఆయన వేర్వేరుగా సమా వేశం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడు తూ బుధవారం నుంచి ఈనెల 6వతేదీ వరకు జరిగే ఎన్నికలకు బిట్రగుంట రైల్వే స్టేషను బూత్ నెంబరు 15గా కేటాయించారని తెలిపారు. బిట్రగుంట సెక్షన్ పరిధిలోని రన్నింగ్, ఇతర శాఖల ఉద్యోగులు 850 మంది ఉన్నారని తెలిపారు. ఉద్యోగులు ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు మడమనూరు విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం రాధాకృష్ణ

మనుబోలు, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీ లకు మండలంలోని మడమనూరు ఉన్నతపాఠశాల 9వ తరగతి విద్యార్థి కేశవానంద ఎంపికయ్యాడు. దీంతో మంగళవారం విద్యార్థిని హెచ్ఎం వీవీ. రాధాకృష్ణ అభినందించారు. గతనెల 23, 24వ తేదీలలో అనంతపురం జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో కేశవానంద బంగారు పతకం సాధించాడు. దీంతో ఈనెల 14, 15వ తేదీలలో పంజాబ్‌లోని లుధియానాలో నిర్వహించే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యాడు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీమోహన్‌రావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీతో షేడ్ నెట్, పాలిహౌస్‌ల నిర్మాణం

నెల్లూరు (వ్యవసాయం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రక్షిత వ్యవసాయ పథకం కింద షేడ్ నెట్, పాలిహౌస్‌ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తోందని ఉద్యాన శాఖ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు వ్యక్తిగతంగా షేడ్ నెట్ హౌస్ నిర్మాణానికి ఎకరాకు రూ.28.4 లక్షలు, పాలిహౌస్ నిర్మాణానికి రూ.37.4 లక్షలు ఖర్చవుతుండగా 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పాలిహౌస్, షేడ్ నెట్‌లలో చామంతి సాగుకు ఎకరాకు రూ.8.52 లక్షలు, కీరదోస, క్యాప్సికం తదితర కాయగూరల సాగుకు ఎకరాకు రూ.2.8 లక్షలు రాయితీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7995086780 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఎరువుల దుకాణం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసులు

వెంకటాచలం (ఆంధ్ర జ్యోతి) : గొలగమూడిలో ఉన్న ఎరువుల దుకా ణాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎస్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక ధరలకు ఎరువులు విక్రయించవద్దని, నిర్ధేశించిన ధరకే విక్రయించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి డీ హరి కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ఆక్వా’ వారందరూ లైసెన్సు పొందాలి

- అప్సడా కో వైస్ చైర్మన్ ఆనం



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న వెంకట రమణారెడ్డి, పక్కన మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులతోపాటు హేచరీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, దుకా ణాల నిర్వాహకులు, ల్యాబ్‌లు, వ్యాపార సంస్థలు అన్నీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ అభివృద్ధి అథారిటీ(అప్సడా) చట్టం కింద లైసెన్సు పొందాలని అప్సడా కో వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని మత్స్యశాఖ కార్యాలయంలో మంగళ వారం అప్సడా చట్టం అమలు తీరుపై అధికారులతో ఆయన సమీక్షించారు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి ఆక్వా రంగాన్ని క్రమబద్ధీకరించా లని, అనుమతి లేని ఆక్వా సాగు చెరువులు, వ్యాపార సంస్థలకు నోటీసులు ఇవ్వాలని సూచించారు. రైతుల ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆక్వా ల్యాబ్‌లలో రైతులకు మెరుగైన సేవలందిం చాలన్నారు. ముదివర్తిపాళెం చెక్‌డ్యామ్‌ను పూర్తి చేసి ఆక్వా రైతులను ఆదుకుంటామని, ప్రభుత్వ, ప్రజల భాగస్వామ్యంతో ఉప్పునీటి కాలువలు, క్రీకులలో అడ్డంకులు, పూడికలు తీయిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, నెల్లూరు, కావలి ఏడీలు వీవీఆర్.బాబు, శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపు కేసులో
ముగ్గురికి ఏడేళ్ల జైలు

నెల్లూరు, (లీగల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వివాహితను అదనపు కట్నం కోసం వేధించి ఆమె మరణానికి కారకులయ్యాడన్న కేసులో నేరం రుజువు కావడంతో గొల్లపూడి విజయకృష్ణ, విజయలక్ష్మి, చల్లా అర్చన అనే ముగ్గురికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు 8వ అదనపు జిల్లా (ప్రత్యేక మహిళా కోర్టు) జడ్జి జీ గీత మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముత్తుకూరుకు చెందిన గొల్లపూడి విజయకృష్ణకు కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం భూషణగల్లు గ్రామానికి చెందిన విజయలక్ష్మినిచ్చి పెద్దలు వివాహం చేశారు. రూ.4 లక్షలు కట్నం గా ఇచ్చారు. పెళ్లయిన 20 రోజుల నుంచి విజయ కృష్ణ, అయన తల్లి విజయలక్ష్మి, ఆడపడుచు చల్లా అర్చన అదనపు కట్నం కోసం విజయలక్ష్మిని వేధిం చడం ప్రారంభించారు. 2016 ఏప్రిల్ నెల 10వ తేదీన అత్త గొల్లపూడి విజయలక్ష్మి వియ్యాల వారికి ఫోన్ చేసి మీ అమ్మాయి కిరోసిన్ పోసుకుని తగుల బెట్టుకుందని తెలిపింది. దీంతో కోడలు తల్లి వీరకు మారి బంధు వులతో ముత్తు కూరు వచ్చింది. అక్కడి పరిస్థితు లను గమ నించి అత్తింటి వారే తన బిడ్డపై కిరోసిన్ పోసి తగులబెట్టారని నిర్ధారించుకుని ముత్తుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంకే విజయలక్ష్మి వాదించారు

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచాలి

- ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల త్రైమాసిక పరీక్షల ఫలితాలపై ప్రిన్సిపాళ్లతో సమీక్ష జరిపారు. కొన్ని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం బాగా తగ్గిందన్నారు. రానున్న పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా పని చేయాలని సూచించారు. విద్యార్థులందరూ ప్రతిరోజూ కళాశాలకు వచ్చేలా చూడాలని, రాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వందశాతం హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. సంకల్ప్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, స్టడీ అవర్స్ ఎక్కువగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు, డీవీఈవో మధుబాబు, పాల్గొన్నారు.

● పేరెంట్స్ - టీచర్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీన ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేరెంట్, టీచర్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహణపై ఆయన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. సమావేశానికి తల్లిదండ్రు లందరూ తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలన్నారు. పూర్వ విద్యార్థులను, ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి మండల ప్రత్యేకాధికారులు, విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గురువారం నాటికి ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచ డానికి ఈవోపీఆర్‌డీలు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఉదయ్‌భాస్కర్, డీఈవో బాలాజీరావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్ఐవో శ్రీనివాసులు, డీపీవో శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	107
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	224
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7344
వెండి కిలో ధర	రూ. 91,700
వెండి ఒక గ్రాము	రూ.94.70

డెంగ్యూ, మలేరియా వ్యాధిగ్రస్థులను
గుర్తించండి: డీఎంహెచ్‌వో

నెల్లూరు (వైద్యం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతకమైన డెంగ్యూ, మలేరియాతోపాటు ఫైలేరియా, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం ప్రాణాంతక వ్యాధుల నిర్ధారణపై ల్యాబ్ టెక్నీషియన్లతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. డీఎం హెచ్‌వో మాట్లాడుతూ సకాలంలో వ్యాధి గ్రస్తులను గుర్తిస్తే వెంటనే వైద్యం అం దించే వీలుంటుందని తెలిపారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు పీహెచ్‌సీల్లో ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు రాత్రి 8 నుంచి 10 గంటల వరకు రక్తనమూనాలు సేకరించాలని సూచించారు. 20 ఏళ్ల పైబడిన వారిలో బోదవ్యా.ధిని గుర్తించి తగిన చికిత్స అందించేలా సహకరిం చాలని ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి హుస్సేనమ్మ, ఏఎంవో నాగార్జునరావు, సూపర్‌వైజర్లు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు. .

మద్యం అక్రమ విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని టైలర్స్ కాలనీ వద్ద అక్రమంగా మద్యం విక్రస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ నెల్లూరు-1 పోలీసులు మంగళవారం దాడులు చేశారు. మద్యం అమ్ముతున్న షేక్ మహబూబ్ బాషాను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇదే విధంగా నగరం లోని కొత్తకాలువ సెంటర్ వద్ద తుమ్మల కార్తీక్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

12 మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనదిన్నెలో మంగళవారం బెల్టు దుకాణంపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో మద్య అమ్మకాలు చేపడుతున్న జంపాని తిరుపతి స్వా మిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసు కున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో నెల్లూరు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ వింగ్ టీం ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

కుండపోత వర్షం.. నీటమునిగిన పైర్లు

● పొంగుతున్న వాగులు, నిండిన చెరువులు ● లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు ● జనజీవనం అస్తవ్యస్తం


వరికుంటపాడు : నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న ఏవో రవికుమార్


అల్లూరు : సచివాలయంలోకి చేరిన వర్షపునీరు


బిట్రగుంట : గిరిజన కాలనీలోకి చొరపడిన వాననీళ్లు

ఉలవపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కురిసిన వర్షానికి మండంలోని చెరువులు పొంగి పొర్లుతున్నాయి. ఆయకట్టులో సాగుచేసిన వరిపైరు నీట మునిగింది. మండలంలోని చాగొల్లు, చాకిచర్ల గ్రామాల చెరువులు అలుగులు పారుతున్నాయి. మండలంలో సుమారు 500 ఎకరాల్లో పంట నీటి మునిగి ఉంది.దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ తీరం దాటినా మంగళవారం అల్లూరులో కుండపోత వర్షం కురిసింది. మధ్యహ్నం వరకు పొడి వాతావరణంగా ఉండగా ఒక్కసారిగా భారీవర్షం కురిసింది. ఈ వర్షానికి సచివాలయం-1లోకి నీరు చేరింది.

●వరికుంటపాడు, (ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలకు ప్రజలు విసుగెత్తిపోతున్నారు. మంగళవారం సైతం ఏకదాటిగా కురిసిన వర్షానికి బెంబేలెత్తిపోయారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తాగునీటి పథకాలు వినియోగంలో లేకపోవడంతో తిప్పలు తప్పలేదు. నాయుడుపల్లికి వెళ్లే వంతెన దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న అధికారులు, టీడీపీ నాయకులు అక్కడికి చేరుకొని తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మండలంలోని జీ.కొండారెడ్డిపల్లి, కొండ్రాజుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో కోత దశలో ఉన్న వేల ఎకరాల వరి పంట నేలకొరిగి నీటి మునిగింది. విరువూరులోనూ శనగ పంట పూర్తిగా దెబ్బతింది. మంగళవారం వ్యవసాయాధికారి రవికుమార్ దెబ్బతిన్న పంటలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు.

● ఆత్మకూరు, (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నియోజకవర్గంలో మంగళవారం ఈదురగాలులు, ఉరుములు, మెరుపులతో జోరువాన కురిసింది. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వీవర్స్ కాలనీలో రోడ్లు బురదమయవడంతో కాలనీవాసులు ఇబ్బందుల పడుతున్నారు. వీవర్స్ కాలనీ నిర్మించి 40 ఏళ్లు అవుతున్నా రోడ్లు, మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికైనా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 23వ వార్డు పరిధిలోని అల్లీపురం, నెల్లూరుపాళెం ముస్లిం కాలనీలో రోడ్లు జలమయమయ్యాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. వాగులు, వంకల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఆర్డీవో బి పావని, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి) బోగోలు మండలంలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. దీంతో చెరువుల కలుజులు, కాలువలు పొంగి పారుతున్నాయి. విశ్వనాథరావుపేట కొత్తూరు వాగు నిండుగా ప్రవహించడంతో రాత్రి రామస్వామిపాలెం గిరిజన కాలనీలోకి నీరు చొరపడ్డాయి. అంబేడ్కర్ సేవాదళ్ నేత రవిచంద్ర, స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం తెలియచేయడంతో వీఆర్వోలు అశోక్, శ్రీనివాసులు పరిస్థితిని పరిశీలించి, కాలనీ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేశారు.అధికారులు అప్రమత్తమయ్యారు.

పైరు మునిగిందని రైతుల దీక్ష



కావలి, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగాయగారిపాలెం రోడ్డులోని పంటకాలువలను రియల్ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారు. దీంతో వర్షాలకు సుమారు 40 ఎకరాల వరిపైరు నీటి మునిగింది. ఈ క్రమంలో మంగళవారం రైతులతో కలిసి రైతు సంఘం నాయకుడు రామిరెడ్డి క్రిష్ణారెడ్డి పొలం వద్దనే దీక్ష చేపట్టారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి పూడ్చిన కాలువలను తెరిపించి, పొలాల నుంచి వర్షపునీరు బయటకు పోయేలా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మున్సిపల్ కమిషనర్


కావలి : చెక్కు అందచేస్తున్న మున్సిపల్ కమిషనర్


కందుకూరు : బహుమతులు అందుకున్న చిన్నారులు

కావలి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఉపాధి పొందాలని కావలి మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్కుమార్ తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో మూడు విభిన్న ప్రతిభావంతుల గ్రూపులకు రూ.32లక్షల చెక్కును అందచేశారు. పలువురు వికలాంగులకు రుణసదుపాయ అనుమతిపత్రాలు, ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దివ్యాంగులు ఏదైనా అవసరాలు, సమస్యలు ఉంటే తనను కానీ, మెప్మాను కానీ సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా సీవో కిరణ్, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

● లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ఎంఈవో-2 ఎంవీ శివకుమార్, ఐఆర్టీలు సుప్రియ, శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఎం సుధాకర్, ఉపాధ్యాయురాలు సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఉన్నత పాఠశాల హెచ్ఎం బాలకేశవులు పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగులకు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షబ్బీర్, ఐఆర్టీలు శివనందిని, సుభాష్చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని డిప్యూటీ డీఈవో ఎం. వెంకట జానకీరామ్ కోరారు. పట్టణంలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో కె. సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మరో ఎంఈవో అజయ్బాబు, న్యాయవాదులు వీవీ సుబ్బారావు, సంపత్కుమార్, ఎం. మనోహర్, శ్రీధర్నాయుడు, వివిధ శాఖల అధికారులు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు సహిత విద్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హెచ్ఎం నిత్య పూజయ్య ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను ఎంఈవో చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో ఐఆర్టీలు కళ్యాణి, కాత్యాయిని తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత కేంద్రంలో ఐఆర్టీలు డేగ హరిబాబు, బ్రహ్మయ్యల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో-1 కే.రవికుమార్ పాల్గొని, విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం రహీం, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో మస్తాన్వలి అధ్యక్షతన మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో విద్యార్థులకు మిఠాయిలు పంచారు. ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కే శ్రీనివాసులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

● సంగం, (ఆంధ్రజ్యోతి): స్థానిక నార్త్ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంఈవో -2 మల్లయ్య దివ్యాంగ పిల్లలను తల్లిదండ్రులు చిన్నచూపు చూడకుండా అని విధాలుగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పోలయ్య, నరసమ్మ, ఐఈఆర్టీ పెంచలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పేట, (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూ ప్రాథమిక పాఠశాలలోని భవిత సెంటర్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు విద్యా సమగ్రి, హాట్ బాక్సులు ఎంఈవో-2 సాయి ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుల్తానా, ఐఈఆర్పీలు ఎండీ రెహమన్, పీ.మోహన్, ఫిజియోథెరపిస్ట్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరు, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు ఎస్కె.సాల్మన్ దివ్యాంగుల పిల్లలకు వాటర్ బాటిల్స్ ఉపాధ్యాయుడు బాలాజీ టిఫిన్ బాక్స్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మధుసూదన్రెడ్డి, హెచ్ఎం. సీహెచ్.మాలకొండయ్య పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ డేను విజయవంతం చేయండి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7న నిర్వహించే మెగా పేరెంట్స్, టీచర్స్డేను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజా మొహిద్దీన్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు ఉర్దూ పాఠశాలలను ఆయన సందర్శించి, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకమ్మకు గిరిధర్రెడ్డి పూజలు

సంగం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి సోదరుడు, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్రెడ్డి స్వగ్రామమైన మండలంలోని పడమటిపాళెంలోని అంకమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టిన ముందుగా స్వగ్రామంలోని అంకమ్మ ఆలయంలో పూజలు చేసి ప్రారంభించడం ఆనవాయితీ. ఈ క్రమంలో గిరిధర్రెడ్డి బుధవారం నుంచి నెల్లూరు రూరల్లో వారానికి రెండు రోజులు ఏడాది పాటు నియోజకవర్గంలో గడప గడప కార్యక్రమం చేపట్టనుండడంతో ఈ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామస్థులతోపాటు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

చెరువు కట్ట నరికి కొట్ల నిర్మాణం

కావలిటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముసునూరు ట్రంకురోడ్డును ఆనుకుని ఉన్న మందాటి చెరువు కట్టను, అక్రమార్కులు నరికి కొట్లు (అంగళ్లు) నిర్మిస్తున్నారు. ఈ చెరువు కట్ట ఆనుకుని ఆటోనగర్ పేరిట మెకానిక్లకు ప్రభుత్వం ఉచితంగా స్థలాలు మంజూరు చేసింది. అయితే బడాబాబులు రంగప్రవేశం చేసి ఆ స్థలాలు హస్తగతం చేసుకుని భారీ షోరూమ్లు నిర్మించి, బాడుగలకు ఇచ్చేశారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు చెరువు కట్టను అడ్డంగా నరికి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలను అడ్డుకోవాలని మందాటి చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు కనుమూరు బాస్కర్ రెడ్డి, సభ్యులు ఆర్డీవోకి ఫిర్యాదు చేశారు.


మందాటి చెరువు కట్ట ముఖంగా నిర్మించిన కొట్లు

సంగం బ్యారేజీకి 6 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం

సంగం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి ఎగువ ప్రాంతాల నుంచి ఆరు వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుంది. దీంతో బ్యారేజి వద్ద నీటిమట్టం 10.4 అడుగులకు చేరింది. తుఫాన్ ప్రభావంతో బ్యారేజీకి ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వాగులు, వంకలు ప్రవహించి బీరాపేరు, బొగ్గేరు ఉప నదుల నుంచి పెన్నానదికి వచ్చి బ్యారేజీ వద్ద కలుస్తున్నాయి. బ్యారేజీకి వరద నీటి ప్రవాహం వస్తుండడంతో డెల్టాకు సోమశిల జలాశయం నుంచి విడుదల చేస్తున్న నీటిని మంగళవారం పూర్తిగా నిలిపివేశారు. బ్యారేజీకి వస్తున్న నీటిలో (బెజవాడ పాపిరెడ్డి) కావలి కాలువకు 500 క్యూసెక్కులు, కనిగిరి ప్రధాన కాలువ ద్వారా కనిగిరి రిజర్వాయర్కు 340 క్యూసెక్కులు, నెల్లూరు తాగునీటికి 50 క్యూసెక్కులు, నెల్లూరు చెరువుకు 100 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. మిగిలిన నీటిని ఏడు బ్యారేజ్ గేట్లు ఎత్తి నెల్లూరు బ్యారేజికి విడుదల చేస్తున్నారు.


సంగం బ్యారేజీకి దిగువకు ప్రవహిస్తున్న వరద నీటి ప్రవాహం

విద్యుదాఘాతంతో గేదె మృతి

ఏఎస్పేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందింది.ఈ ఘటన సోమవారం రాత్రి అనుమసముద్రంలో జరిగింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నరేష్ గేదెల పెంపకంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ తరుణంలో సోమవారం ఉదయం తన 6 గేదెలను మేతకు పొలాలకు తోలాడు. సాయంత్రం ఇంటికి 5 గేదెలే వచ్చాయి. దీనితో ఆ గేదె కోసం గాలించగా గ్రామంలోని సచివాలయం సమీపంలోని ఓ ప్రైవేట్ సంస్థ సెల్ టవర్ కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ వద్ద మృతి చెందిఉంది. ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె లేక గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని, రూ.70వేలు నష్టం జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



సోమశిల బస్టాండ్లో రొచ్చు రొచ్చు

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): సోమశిల బస్టాండ్ సెంటర్ బురదమయంగా మారింది. నాలుగేళ్ల క్రితం రూ.40 లక్షలు వెచ్చించి సిమెంట్ రోడ్డు పనులు చేశారు. అయితే వ్యాపారులు కొందరు తమ అంగళ్ల ముందు మట్టి తోలి గుంతలు పూడ్చడం మూలంగా బస్టాండ్ సెంటర్ రొచ్చు రొచ్చుగా మారింది.

తపాలా సేవలను మెరుగుపర్చండి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తపాలా సేవలను మెరుగుపరచాలని పోస్టల్ సూపరింటెండెంట్ కే శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయగిరి పోస్టల్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికి బీమా సౌకర్యం కల్పించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. లక్ష్యాలు అధిగమించని ఉద్యోగులు త్వరితగతిన వాటిని పూర్తి చేయాలన్నారు. అనంతరం లక్ష్యాలు అధిగమించిన ఉద్యోగులకు వెండి నాణేలు, బ్యాగ్లు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఐపీవో వేగూరు సాయి కృష్ణారెడ్డి, ఎస్పీఎంలు, బీపీఎంలు, జీడీఎస్లు తదితరులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

బొల్లినేని సురేంద్ర మృతి తీరనిలోటు : ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు చిన్న కుమారుడు, నందమూరి బాలకృష్ణ అభిమాని, సోషల్ మీడియా సైనికుడు, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు బొల్లినేని సురేంద్ర మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దపాడులో మంగళవారం సురేంద్ర పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సురేంద్ర తండ్రి రామా రావును పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్రెడ్డి, టీడీపీ నాయకులు చెంచలబాబు యాదవ్, నియోజకవర్గంలోని ఎనిమిదిమండలాల నాయకులు పాల్గొన్నారు.


సురేంద్ర పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఆనంను కలిసిన టెక్స్టైల్స్ ఫెడరేషన్ నేతలు


మంత్రి ఆనంను కలిసిన టెక్స్టైల్స్ ఫెడరేషన్ నాయకులు

కావలి,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసరాల్లో టెక్స్టైల్ పార్కు ఏర్పాటు ఆవశ్యకతను గురించి జీఎస్టీ సభ్యుడు,బీజేపీ నాయకుడు అమరా వెంకట సుబ్బారావు టెక్స్టైల్స్ ఫెడరేషన్ నాయకులతో కలసి మంగళవారం తాడేపల్లిలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలిసారు. టెక్స్టైల్ పరిశ్రమలో ఎదురవుతున్న సమస్యలను తెలియచేసి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వస్త్రవ్యాపారాభివృద్ధికి సహకరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో టెక్స్టైల్స్ ఫెడరేషన్ నాయకులు మల్లేశ్వరరెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం మండలం కొండసముద్రం గ్రామానికి చెందిన మన్నం పుల్లయ్యకు శస్త్రచికిత్స కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. 3.5 లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్వోసీ)ని మంగళవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బాధితుడికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల వైద్యంకోసం సీఎం చంద్రబాబు ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

అవార్డు గ్రహీతలకు సత్కారం

కావలిటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందిన కావలి ఐఎంఏ వైద్యబృందానికి రెడ్క్రాస్ శాఖ, రోటరీ క్లబ్ల ఆధ్వర్యంలో ఘన సత్కారం చేశారు. మంగళవారం రెడ్క్రాస్ రక్తనిధి భవనంలో రక్తనిధి కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కే సుబ్బారావు, కార్యదర్శి డాక్టర్ గోపి, కోశాధికారి డాక్టర్ శివప్రసాద్, డాక్టర్లు సతీష్ ఉషారాణి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, రమేష్, హరనాథ్రెడ్డి, సీతాలక్ష్మి, జమున స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న వైద్యులు

ఉచిత పశువైద్య శిబిరం

కలిగిరి, డిసెంబరు3,(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులకొల్లులో మంగళవారం జిల్లా పశుగణాభివృద్ధి శాఖ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఉచిత గర్భకోశవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. కృత్రిమ గర్భధారణతో మేలైన పెయ్యదూడల ఉత్పత్తిపై రైతులకు అవగాహన కలిగించారు. పశుగ్రాస విత్తనాలు 75శాతం రాయితీతో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పూసాల వెంగపనాయుడు, పశువైద్యాధికారులు డీ శ్రీనివాసరావు, కే సురేష్బాబు, కే లక్ష్మీప్రసాద్, ఆర్ వీరహరిణ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల ద్వారా కేంద్రం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం తిమ్మారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం కళాబృందం సభ్యులు పథకాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు, అంగన్వాడీ, పొదుపు సిబ్బంది పాల్గొన్నారు.

పాసుపుస్తకాలు ఇవ్వకుండా ఆపండి

కలువాయి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశమనేనిపల్లిలో వివాదాస్పదంగా ఉన్న భూములకు సంబంధించి ఎలాంటి పట్టాదారు పాస్పుస్తకాలు మంజూరు చేయవద్దని మంగళవారం గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు శ్యామ్సుందర్రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ భూములకు సంబంధించిన వ్యవహారం కోర్టులో నడుస్తుందని అయినా గతంలో కూడా పాస్ పుస్తకాలు మంజూరయ్యాయని వారు వివరించారు. దీనిపై రైతులకు న్యాయం చేయాలన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు

లింగసముద్రం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పగుడి వద్ద సీసీ రోడ్డు, కాంక్రీట్ పంట కాలువ నిర్మాణం చేయించినందుకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. అయ్యప్పగుడి ఎదురుగా ఉన్న పంట కాలువ, మట్టిరోడ్డు వర్షాలు కురిసినప్పుడు బురదమయమై భక్తులు ఇబ్బందులు పడేవారని ఆలయ కమిటీ సభ్యులు గొర్రెపాటి విజయభాస్కర్రెడ్డి చెప్పారు. వాటిని ఎమ్మెల్యే మరమ్మతులు చేయించారని ఆయన తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

కలువాయి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో ఖాతాకలిగిన ప్రతి ఒక్కరూ సైబర్ మోసాలపై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని పొదలకూరుకు చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. నూకనపల్లి గ్రామంలో మంగళవారం ఆర్బీఐ సౌజన్యంతో ఆ సంస్థ ప్రతినిధులు గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచితుల నుంచి ఫోన్కాల్స్కు, మెసేజ్లకు స్పందించవద్దన్నారు. బ్యాంకు పథకాలు, సేవలు, నగదు రహిత లావాదేవీలు, బ్యాంకింగ్ అంబూడ్స్మెన్ సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ అధ్యక్షుడు షేక్.నౌరజ్, టీ.వెంకటేశ్వర్లు, షేక్.రముత్తుల్లా, సంఘబంధం సభ్యులు పాల్గొన్నారు.

ముంపు పైర్లకు సస్యరక్షణ అవసరం

అల్లూరు, డిసెంబరు 3 : వర్షపు నీటిలో మునిగిన పైర్లకు సస్యరక్షణ అవసరమని మండల ఏవో వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని సింగపేటలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అరగల రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

● ఉదయగిరి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా వరి సాగు చేసిన రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల ఏవో ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● సీతారామపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బసినేనిపల్లిలో మండల ఏవో పీ చెన్నారెడ్డి అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తమ వాటాగా వరికి ఎకరాకు రూ.168 చెల్లిస్తే రూ.42000లు పంటల బీమగా పొందవచ్చన్నారు.అలాగే అన్నీ పంటలకు బీమా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివయ్య, వెటర్నరీ అసిస్టెంట్ అక్తర్, వీఏఏ షబీనా,మార్కెటింగ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

● కలువాయి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్లో సాగుచేసిన పైర్లుకు రైతులు పంట బీమా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వీ.ప్రతాప్ కోరారు. వరి, పచ్చిశనగ, మినుము పైర్లుకు బీమా వర్తిస్తుందని తెలిపారు. వరికి ఎకరానికి రూ.168, మినుముకు రూ.38, పచ్చిశనగకు రూ.56లు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని చెప్పారు. ఇంతకంటే ముందుగా రైతుసేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుడు ద్వారా ఈ-క్రాప్ నమోదు తప్పసరిగా చేయించాలన్నారు. వరికి ఈనెల ఆఖరు వరకు, పప్పు దినుసుల పంటలకు 15వతేదీ ఈ-క్రాప్ నమోదు చేయించుకుని ఆ తరువాత బీమా చేసుకోవాలన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

● రామిరెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు, వింజమూరు



జలదంకి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడవద్దని వింజమూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రామిరెడ్డి తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు.

? : వరిసాగులో ఎరువుల వాడకం ఎలా..

! : వరిసాగులో ఎకరానికి దుక్కిలో సూపర్పాస్పేట్ 150కిలోలు లేక డీఏపీఈ 50 కిలోలతోపాటు 20కిలోల యూరియా వేసి తరువాత ప్రతి 12రోజులకు యూరియా ఒక బ్యాగు వంతున పైపాటుగా వేయాలి. చివరి దఫాలో అరకట్ట పొటాష్ వేస్తే సరిపోతుంది.

? : అధికమోతాదులో ఎరువులు వాడితే...

! : అధికమోతాదులో ఎరువులు వాడకం వల్ల వరిపైరుకు తెగుళ్ల బెడద అధికమవుతుంది.

? : వరిపైరుపై తెల్లతెగులు నివారణ చర్యలేంటి.

! : వాతావరణంలో మార్పుల కారణంగా ఈ తెగులు సోకుతుంది. ఇది రాకుండా వరిపొలం మధ్యలో సోలార్ ప్యానల్తో కూడిన లైట్ట్రాప్ ఎకరానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఈ పరికరం మార్కెట్ లోరూ.1500కు దొరుకుతోంది.

? : ఎరువులు పైపాటుగా వేసే సమయంలో యాజమాన్య పద్ధతులు

! : వరిపైరుపై పైపాటుగా ఎరువులు వేసే సమయంలో వరికయ్యలో సమాంతరంగా నీరు ఉంచి వేయాలి. ఎరువులు వేసిన తరువాత మడిలో నీరు మరో మడిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

న్యూస్ బాక్స్

ఫిబ్రవరిలోగా పశుగణన పూర్తి

లింగసముద్రం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నీ గ్రామాల్లో జరుగుతున్న పశుగణనను వచ్చే ఫిబ్రవరి నెలాఖరులోపు పూర్తి చేయాలని కందుకూరు పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ గుడ్ శ్రీధర్ చెప్పారు.మంగళవారం మండలంలోని వీఆర్ కోట, చినపవని, అన్నెబోయినపల్లి గ్రామాల్లో జరుగుతున్న జాతీయ పశుగణనను ఆయన పరిశీలించారు. మండలంలో ఉన్న 35702 గొర్రెలు, 4517 మేకలకు ఉచితంగా పారుడు వ్యాధి నిరోధక టీకాలను ఈ నెలాఖరులోపు వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై శ్రీకాంత్, పశుగణ సహాయకులు సీహెచ్ మహేంద్ర, జె ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం వాయిదా

వింజమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం జరగాల్సిన నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశం వాయిదా పడిందని టీడీపీ నాయకులు తెలిపారు. వర్షాల కారణంగా వాయిదా వేశామని, ఎప్పుడు జరిగేది తర్వాత ప్రకటిస్తామన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 6 నుంచి జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దారు సభ్రద మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భూ సమస్యలు, సర్వేనెంబర్లలో మార్పులు, వారసత్వ పేర్ల నమోదు, సరిహద్దు సమస్యలు, భూ విస్తీర్ణంలో తేడాలు ఇతరత్రా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉపాధి అవకాశాలపై శిక్షణ

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రిన్సిపాల్గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డాక్టరు వణుకూరి శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొని నైపుణ్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటును సహించేది లేదు

కందుకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల సముదాయం ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో పెట్రోలు బంకు పెట్టనివ్వబోమని నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆదిత్య సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, అభివృద్ధి మండలి ప్రతినిధులు మాట్లాడారు. గత ప్రభుత్వంలోనే అన్ని అనుమతులు వచ్చాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారని, మంత్రులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే కూడా ఈ ప్రతిపాదనను విరమించుకునేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో మండలి ప్రతినిధులు నేతి మహేశ్వరరావు, ఎం. కిషోర్, పాలేటి కోటేశ్వరరావు, టీ. వెంకటేశ్వర్లు, ఆర్ అయ్యన్న, టీ వెంకటేశ్వర్లు, బీ సురేష్బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రతినిధులు

నెల్లూరు సిటీ
రూరల్, కోవూరు, సర్వేపల్లి

న్యూస్ బాక్స్

న్యాయవాదులకు ఆరోగ్య బీమా

నెల్లూరు (లీగల్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులకు ఆరోగ్య బీమా పాలసీ చేయించే నిమిత్తం నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో బీమా సంస్థ ప్రతినిధులు మంగళవారం అసోసియేషన్ హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ కార్డు వల్ల ఉపయోగాలు, దరఖాస్తు విధా నాన్ని వివరించారు. పలువురు న్యాయవాదులు వారి హెల్త్ కార్డులను రెన్యు వల్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం బుధవారం కూడా కొనసాగుతుంద ని బార్ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనా టి చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఎం సుందరయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల సహాయకులకు అన్నదానం

నెల్లూరు(విద్య), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ ద్వారా రోగుల సహాయకులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్న ప్రసాద వితరణ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు మాట్లాడుతూ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పొన్నం రవిచంద్ర తల్లి భారతమ్మ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశామన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో గురువారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏడీఈ సతీష్ కుమార్, కోవూరు ఏఈ రమేష్‌చౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోవూరుటౌన్, రూరల్, ఇనమడుగు, బుచ్చిరెడ్డిపాళెం టౌన్, రూరల్, దామరమడుగు, సంగం, నార్తురాజుపాళెం, విడవలూరు, ఊటుకూరు, ఇందుకూరుపేట, కొత్తూరు, మైపాడు, ముదివర్తిపాళెం సెక్షన్లకు సంబంధించిన వినియోగదారులు వారి సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

రేపు దండిగుంటలో వేలం పాటలు

విడవలూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దండిగుంట పంచాయతీ ఆధీనంలో ఉన్న మూలపుగుంట, స్నానాల గుంటలలో చేపల పెంపకం, పట్టుకొనేందుకు గురువారం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచు బెల్లంకొండ శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి సుమంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11గంటలకు వేలం పాటలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు.

నేడు హిందూ ర్యాలీ

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువుల నరమేధానికి నిరసనగా బుధవారం సాయంత్రం నగరంలో హిందూ చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్నట్లు హిందూ రక్షా వేదిక ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమం వీఆర్సీ మైదానం నుంచి ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, ఏసీ సెంటర్ మీదుగా నర్తకి సెంటర్ వరకు సాగుతుందని పేర్కొంది. బంగ్లాదేశ్‌లోని హిందువులకు మద్దతుగా అందరూ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చింది.

దుప్పట్ల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట ఇరుకళల పరమేశ్వరి ఆలయం వద్ద మంగళవారం పేదలకు దుప్పట్ల పంపిణీ జరిగింది. దాత కోడూరు హరినారాయణరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఈ కార్యక్రమం నిర్వహించింది. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మహేంద్రరెడ్డి, సినీ దర్శకుడు సుధాకర్‌రెడ్డి, మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు బీమా చేయించుకోవాలి

విడవలూరు, (ఆంధ్రజ్యోతి): వరి, వేరుశనగ పంటలకు బీమా చేయించుకుంటే రైతులకు ప్రయోజనమని ఏడీఏ సుజాత తెలిపారు. విడవలూరులో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.

● సైదాపురం,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లిలో మంగళవారం మండల వ్యవసాయ శాఖాధికారి హైమావతి ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

నేడు సచివాలయ భవనం ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ బెజవాడ గోపాలరెడ్డినగర్‌లో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రారంభిస్తారని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఎక్స్‌కవేటర్, గల్పర్, పాగింగ్ పరికరాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.



రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

● ఇరుగాళమ్మ ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రారంభించిన రాహుకాల పూజలకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో రాహుకాల దీపాలు వెలిగించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమా న్ని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సతీమణి సుజిత ప్రారంభించారు. మహిళలు సౌభాగ్యం కోసం చేసుకునే రాహుకాల పూజలను ప్రతీ మంగళవారం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్ర యాదవ్, ఈవో గిరికృష్ణ పర్యవేక్షించారు. బాబ్జీ, మాలేపాటి చైతన్య, శ్రీనాథ్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు. మహిళా కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్

● కోవూరు నియోజకవర్గంలో 117 మంది లబ్ధిదారులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ



బుచ్చి : దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు నిర్వహిస్తున్న వీపీఆర్ ఫౌండేషన్ దివ్యాంగులకు అండగా నిలిచింది. కోవూరు నియోజకవర్గం పరి ధిలోని అన్ని మండలాల్లో గుర్తించిన 117 మంది దివ్యాగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జీ కృష్ణకాంత్‌తో కలసి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు మం డలంలోని 26 మందికి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గంజాయిని అరికట్టాలని ఎస్పీని ఎమ్మెల్యే కోరారు. భవిత కేంద్రానికి మరుగుదొడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సు ప్రజ, ఎంపీపీ శ్రీనివాసులు, తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖరొరెడ్డి, నాయకులు శివరామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామానాయుడు, పోలిశెట్టి నరసయ్య, మురళి, పుసురుపాటి, టీడీపీ, జనసేన. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● విడవలూరు,(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 27 మంది దివ్యాంగులకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ట్రైసైకిళ్లు పింపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గంలోని పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, తహసీల్దారు చంద్రశేఖర్, నాయకులు అడపాల శ్రీధ ర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, చెముకుల కృష్ణచైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొడవలూరు,(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని 16 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే ప్రాశాంతిరెడ్డి ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో వారికి పింఛను పెంచి ముఖ్యమంత్రి ఆదుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు ముంగమూరు శ్రీహరి రెడ్డి, నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, జీవీఎస్ శేఖర్‌రెడ్డి, కేతు వెంకటరమణ, జొన్న శివకుమార్, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాపా వెంకటేశ్వర్లునాయుడు, పంది శ్రీనివాసులు, తువ్వర ప్రవీణ్, కె.వెంకీ పాల్గొన్నారు.

● కోవూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని లేగుంటపాడులో ఉన్న కమ్యూనిటీ హాలులో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొని వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన ట్రైసైకిళ్లను మండలంలోని 16 మంది దివ్యాంగులకు పంపిణీ చేశా రు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నిర్మలానందబాబ, ఎంపీడీవో శ్రీహరి రెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, సర్పంచు జెట్టి రాజగోపాలరెడ్డి, టీడీపీ నాయకులు కాటం రెడ్డి కృష్ణారెడ్డి, నల్లపరెడ్డి సురేష్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, బాలరవి, యాకసిరి విజయమ్మ, మునలి సుధాకర్, యాకసిరి వెంకటరమణమ్మ, నాటక రాణి వెంకట్ పాల్గొన్నారు.

● ఇందుకూరుపేట,(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగదేవిపేటలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మండలంలోని 32 మంది దివ్యాంగులకు ఎలక్ట్రిక్ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, పొన్నెబోయిన చెంచుకిషోర్ యాదవ్, కూకటి వెంకటేశ్వరరెడ్డి, బొల్లినేని రవినాయుడు, అవ్వారు ఏడుకొండలు, కొండూరు సుధాకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

చెరువు తూములకు చెక్కల ఏర్పాటు



తూములకు చెక్కలు అమర్చుతున్న సిబ్బంది

మనుబోలు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీరప్రాంత గ్రామమైన కొలనుకుదురు చెరువుకు సంబంధించిన రెండు తూములకు మంగళవారం చెక్కలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ యువనాయకుడు పి.నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ పల్లిపాళెం వద్ద ఉన్న రెండు తూముల చెక్కలు పదేళ్లుగా దెబ్బతిని ఉన్నాయన్నారు. గత పాలకులు వీటిగురించి పట్టించుకోలేదన్నారు. తూములు దెబ్బతిన్న విషయాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి చెక్కలు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఏఈ కృష్ణ పర్యవేక్షణలో చెక్కలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా రైతులు కసిరెడ్డి సునీల్‌రెడ్డి, బత్తల బాబు, బత్తల సునీల్‌కుమార్‌రెడ్డిలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌తో నుడా చైర్మన్ భేటీ



కలెక్టర్‌ను సత్కరిస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆనంద్‌ను ఆయన చాంబర్‌లో మంగళవారం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నుడా ఆధ్వర్యంలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరారు ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

జడ్పీ పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నెల్లూరు (విద్య), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. బాలభవన్ డైరక్టర్ జీ సుభద్రాదేవి మాట్లాడుతూ దివ్యాంగులు అందరితో సమానంగా, గౌరవంగా జీవనం సాగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు కూడా దివ్యాంగులైన సహాధ్యాయిలను గౌరవిస్తూ వారికి అన్ని విషయాల్లో అండగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ కృష్ణారెడ్డి, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎం ధనుంజయరావు, రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

దివ్యాంగులను అందరితో సమానంగా ప్రోత్సహిస్తే వారు కూడా ఉన్నతంగా ఎదుగుతారని నెల్లూరు ఎంఈవో తిరుపాల్ అన్నారు. నగరంలోని రంగనాయకులపేట భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఎంఈవో మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారుల్లో అపారమైన జ్ఞానం దాగి ఉంటుందని, వారికి సరైన రీతిలో విద్యనందిస్తే అత్యున్నత స్థాయిలో రాణిస్తారన్నారు. అనంతరం బాలలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల హెచ్ఎం షేక్ నిషాద్, ఎంసీపీఎస్ హెచ్ఎం మల్లికార్జున, సంధ్యా, మంజుల పాల్గొన్నారు.

● రాపూరు,(ఆంధ్రజ్యోతి): రాపూరులోని హిందూ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు పండ్లు, భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవానీ, ఎంఈవో జి.శ్రీనివాసులు, భవిత పాఠశాల ఉపాధ్యాయిని ప్రసన్న, సీఆర్‌పీలు బుజ్జమ్మ, సౌజన్య, నరసింహ, ప్రసాద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

యోధ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత్రులు

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాలలో మంగళవారం 53 మంది రచయిత్రులు రాసిన యోధ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సంకలనంలో మాతృత్వం మీద భిన్నమైన కథలు ఉన్నాయి. మాతృత్వంలో సవాళ్లను ఎదుర్కోవడంలో తల్లులు మానసిక వేదనకు, ఒత్తిడికి గురవుతున్నారు. అలాంటి తల్లుల చరిత్రకు కొనసాగింపుగా మానసిక, శారీరక సవాళ్లను ఎదుర్కొని ధైర్యంగా నిలబడిన యోధుల జీవిత చిత్రీకరణలే ఈ కథలు అని వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ గిరి హాజరయ్యారు. రచయిత్రులు సుహాసిని, కరుణశ్రీ, గోవిందరాజు సుభద్రాదేవి, పాతూరి అన్న పూర్ణ, భండారు విజయ, మందవరపు హైమావతి, విజయలక్ష్మి, వినయ తదితరులు పాల్గొన్నారు. పలువురి కథలను విద్యార్థులు సమీక్షించారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



ఎంపీడీవో కార్యాలయం వీధిలో నిలిచిన వర్షం నీరు

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని రోడ్డులో నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఈ నీటిలో అధికారులు, విద్యార్థులు, ప్రజలు, వాహనచోదకులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో ఎంపీడీవో, పీఆర్ డీఈ, ఎంఈవో కార్యాలయాలు, ఎస్సీ హాస్టల్, భవిత కేంద్రం ఉన్నాయి. ఇక్కడ సిమెంట్ రోడ్డు నిర్మించినా డ్రైన్లు లేక అడుగులోతు మేరకు నీరు నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

క్యాలెండరు ఆవిష్కరణ

ఇందుకూరుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగపట్నం చాముండేశ్వరి ఆలయంలో మంగళవారం ముదిరాజ్ సంఘం నాయకులు కొర్నా నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో చాముండేశ్వరిదేవి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో తాతా శ్రీనివాసరావు, పీఎల్‌రావు ముదిరాజ్, ముదిరాజ్ సంఘ నాయకులు, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కండలేరు నిరుద్యోగులకు న్యాయం చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేత రమేష్

రాపూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సోమశిల ముంపు నిరుద్యోగులకు మేలు జరిగేలా, కండలేరు ముంపు నిరుద్యోగులకు అన్యాయం జరిగేలా జలవనరుల శాఖలో ద్వంద ప్రమాణాలు అమలవుతున్నాయని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం నెల్లూరులో డీఆర్వో ఉదయ భాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ సోమశిల జలాశయ ముంపు వాసులకు మాత్రం ప్రత్యేక జీవో విడుదల చేసి నిరుద్యోగ జాబితా ప్రభుత్వం తయారు చేసిందని తెలిపారు. కండలేరు ముంపు వాసులకు మాత్రం ప్రస్తుతానికి అర్హులైన నిరుద్యోగ జాబితాకు ప్రభుత్వం ఆమోదం తెలపడంలేదన్నారు. వారికి కూడా న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరాల సుబ్బారెడ్డి, అల్లూరు నాగేంద్రసింగ్, కళ్లు భాస్కర్, ఏవీ సుబ్బయ్య, మురగ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కిశోరి బాలికల వికాసం ఆవశ్యకం : డీఆర్వో



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సుకు కిశోరి బాలికల వికాసం అత్యంత ఆవశ్యకమని జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్ రావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కిశోరి బాలికల వికాసం జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు 11 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు అత్యంత విలువైందన్నారు. ఆ సమయంలో వారు శారీరకంగా, మానసికంగా ఎదిగేందుకు తోడ్పడటం, సమాజంపై అవగాహన కల్పించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. సోషల్ మీడి యా, సినిమాల ప్రభావానికి లోనవకుండా ఆడపిల్లలు అన్నీ రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వారి రక్షణ, భద్ర తకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత విద్యవైపు అడుగులు వేసేలా వారిని ప్రోత్సహించాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో బాలికలు సైతం విద్యను అభ్యసించేలా చేయూతనివ్వాలన్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీఈవో బాలాజీరావు, మెప్మా పీడీ రాధ, సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డితో బాలయ్య సైన్యం భేటీ

నెల్లూరు(వైద్యం) డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులను మంగళవారం బాలకృష్ణ సైన్యం మర్యాదపూర్వకంగా కలిసింది. తిరుమల వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బాలయ్య సైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు పైరవి అందించారు. సోలార్ డిస్ట్రిబ్యూటర్ శ్రీధర్‌రెడ్డి ప్రశాంతిరెడ్డికి సోలార్ బ్యాటరీ అందించి దాని ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార సమితి అధ్యక్షుడు కేసీ కృష్ణ, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగంశెట్టి మురళీమోహన్, కార్యదర్శి గుండు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

కూటమి రాకతో అభివృద్ధి : ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో అభి వృద్ధి పనులకు నిధులు నిల్ అని, కూటమి రాకతో ఇప్పుడు పుల్లయిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్‌లో రూ.32 లక్షలతో నిర్మించ తల పెట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. చంద్రబాబు పాలనలో అభివృద్ధి పనులు జాతరలా జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి రఘు, కూకటి హరియాదవ్, యానదయ్యా, జమీర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల పరిశీలన

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని నవాబ్‌పేట రైతు బజారు, ఎన్టీఆర్ నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి మంగళవారం పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.

అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్న లారీ

లారీ నాది... డ్రైవింగ్ చేస్తున్నది నేను...! నన్ను అడిగేదెవరు...? అన్నట్లు ఓ వ్యక్తి అతివేగంగా లారీ నడుపుతూ నగరంలోని డివైడర్‌ను ఢీకొట్టాడు. ముత్తుకూరు వద్దనున్న థర్మల్ కర్మాగారాల్లోని బూడిదను తరలించే భారీ వాహనాలు నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై రోజుకు సుమారు 200లకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో మంగళవారం ఓ వాహనం ధనలక్ష్మీపురం పరిధిలోని గుండ్లపాళెం వద్ద అతివేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొంది. అయితే అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



మీరు నేర్చుకున్నది మాకు చెప్పండి

● హైదరాబాద్ మున్సిపల్ అధికారులతో నెల్లూరు కమిషనర్ భేటీ



రోడ్ల నిర్మాణంలో వాడే కంకరను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో అమలవుతున్న మున్సిపల్ సేవలు, అభివృద్ధి పనుల్లో మీరు నేర్చుకున్న మెలకువలను మాకూ చెప్పడంటూ నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ అక్కడి అధికారులతో మంగళవారం భేటీ అయ్యారు. జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో సమావేశమయ్యారు. రోడ్ల నిర్మాణంలో నూతన ఆవిష్కరణలు, తదుపరి పర్యవేక్షణ, పార్కుల నిర్వహణ, వీధిదీపాలు, యూజీడీ రూపకల్పన, ప్రజలకు చేరువలో సేవలు, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ, ఆస్తిపన్నుకు జీఐఎస్ మ్యాపింగ్ వంటి విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం గార్బేజ్ ట్రాన్స్ పోర్టేషన్ ప్లాంటు, జీడిమెట్లలోని సీఅండ్‌డీ ప్లాంటును సందర్శించి నిర్వహణ తీరును తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

మేయర్ రోడ్ల పరిశీలన

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్ చిన్నబజార్‌లో రోడ్డుపై గుంతలను స్థానిక వైసీపీ కార్పొరేటర్ మహేష్‌తో కలిసి మేయర్ పీ స్రవంతి మంగళవారం పరిశీలించారు. పారిశుధ్య పనులపై ఆరా తీసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాగా, స్రవంతి మేయర్‌గా ఎన్నికై మూడేళ్లయినా ఏనాడు నెల్లూరు నగర నియోజకవర్గంలో అడుగుపెట్టలేదు. ఇక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొన లేదు. ఆమె సిటీలోకి ప్రవేశించేందుకు వైసీపీ హయాంలో నాటి నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ అనుమతించలేదు. దీంతో రూరల్ నియోజకవర్గానికే పరిమితమైంది. ఇటీవల ప్రభుత్వం మారడంతో 'సిటీ'లో నూ మేయర్ పర్యటించడం చర్చనీయాంశంగా మారింది.

పశువులను రోడ్లపై వదిలేస్తే ఊరుకోం!

● కార్పొరేషన్ వెటర్నరీ వైద్యుడు మదన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పశువులను బహిరంగంగా రోడ్లపై వదిలేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కార్పొరేషన్ వెటర్నరీ వైద్యుడు మదన్‌మోహన్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని మద్రాసు బస్టాండ్, బీవీనగర్, ధనలక్ష్మీపురం, ముత్తుకూరురోడ్డు ప్రాంతాల్లో ఆయన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. రోడ్లపై ఉన్న పశువులను ప్రత్యేక వాహనాల్లో గోశాలకు తరలించారు. పెంపకందారులు జీవాలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. గోశాలకు తరలించిన పశువుల సంరక్షణ బాధ్యత కార్పొరేషన్ తీసుకోదని స్పష్టం చేశారు.

ఎగరడానికి రెడీ




రాకెట్ ఎత్తు: 44.4 మీటర్లు
బరువు: 320 టన్నులు
ప్రయోగానికి పట్టే సమయం: 26.92 నిమిషాలు



ప్రయోగ వేదికవద్దకు రాకెట్ భాగాలు

స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలతో శ్రీహరికోట రాకెట్ కేంద్రం సందడిగా మారింది. సాయంత్రం 4.08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ 59 రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్న సంగతి తెలిసిందే. మంగళవారం మధ్యాహ్నం 2.38 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్ రేపు సాయంత్రం దాకా కొనసాగుతుంది. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక మీద రాకెట్ ఎగరడానికి సిద్ధంగా ఉంది. కాగా, పీఎస్ఎల్వీ అనుసంధాన ప్రక్రియకు సంబంధించిన ఫొటోలను ఇస్రో మంగళవారం విడుదల చేసింది. పీఎస్ఎల్వీ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ ఫెసిలిటీ (పీఐఎఫ్)లో రెండు దశల రాకెట్‌ను, మొబైల్ సర్వీస్ టవర్‌లో (ఎంఎస్‌టీ) మరో రెండు దశల రాకెట్‌ను అనుసంధానం చేశారు.

మొదటి దశ: 139 టన్నులు ఘన ఇంధనం కలిగిన రాకెట్ మొదటి దశను కేరళలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో డిజైన్ చేసి తీసుకొచ్చి శ్రీహరికోటలో అనుసంధానం చేశారు.



2

రెండో దశ: పీఎస్-2 మోటారులో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపారు. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో మోటారు తయారు చేశారు.



3

మూడో దశ: 7.65 టన్నుల ఘన ఇంధనం నింపారు.

1






4

నాలుగోదశ: ఈ దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనం నింపారు. రాకెట్ శిఖర భాగాన ప్రోబా-3 ఉపగ్రహాన్ని అమర్చారు. ఉపగ్రహం చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చారు. ఇది తుది దశ. ఉపగ్రహాలను నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టే రాకెట్ దశ ఇది. ఈ దశలో ఘన ఇంధనం మోటార్లకు నింపి రాకెట్‌కు అనుసంధానం చేశారు. కౌంట్‌డౌన్ జరిగే సమయంలోనే ద్రవ ఇంధనాన్ని నింపుతారు.

ప్రోబా-3 ఉపగ్రహం



\- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



జలపాత ఝురులు

తుపాను వానలకు శేషాచలంలో కురిసిన వానలు వాగులై వంకలై పారి జలపాతాలుగా మారి దూకుతున్నాయి. గరుడవారధి మీద నుంచి మాలాడగుండం, కపిలతీర్థ జలపాతాలు నయనమనోహరంగా కనిపిస్తున్నాయి. శేషాచలం సిగలో ఈ జలవంకల సొగసు తిరుమలకు వచ్చే భక్తులనూ, తిరుపతి వాసులనూ మురిపిస్తోంది. మంగళవారం ఉదయంనాటి ఈ కమనీయ దృశ్యాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫొటోగ్రాఫర్ అందిస్తున్నారు.









గరుత్మంతుడిపై లోకమాత

శ్రీవారికి ఇష్టుడైన గరుడుడు తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం దేవేరికి వాహనంగా మారాడు. తిరుమల నుంచి తన పాదాలను సైతం శ్రీనివాసుడు తన ఇష్టసఖికి కానుకగా పంపడం విశేషం. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో ఆగమశాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం గావించిన తర్వాత రాత్రి గరుడుడిపై లోకమాతగా అమ్మవారు ఊరేగారు. శ్రీవారి పాదాలనూ, సహస్ర లక్ష్మీకాసుల హారాన్నీ ధరించిన పద్మావతీదేవి శ్రీమహావిష్ణువు రూపంలో గరుడుడిపై ఆశీనులయ్యారు. కళాబృందాల ప్రదర్శనలు, జీయర్‌స్వాముల ప్రబంధ పారాయణం, భక్తుల గోవింద నామస్మరణల మధ్య రాత్రి ఏడు గంటలకు గరుడ వాహనసేవ మొదలైంది. గరుడుడిపై అమ్మవారిని తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో తిరుమాడవీధులు కిక్కిరిసిపోయాయి.

\- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

- మరిన్ని బ్రహ్మోత్సవ విశేషాలు 6లో -

వద్దన్నా వినకుండా..!

- వెళ్లడంతోనే వరద ప్రవాహంలో ఇద్దరి గల్లంతు
- ఒకరి మృతదేహం లభ్యం
- మల్లాం రొయ్యల కాలువ సమీపంలో ఘటన

చిట్టమూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రొయ్యల కాలువ వంతెన వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉంది. ఆ మార్గంలో అధికారులు రాకపోకలను ఆపేశారు. అడ్డంగా ముళ్లకంపలు వేశారు. పోలీసులు కాపలా ఉంటున్నారు. ఆ మార్గాన వెళ్లడం ప్రమాదకరమని ద్విచక్రవాహనంలోని ఇద్దరిని మంగళవారం ఉదయం హెచ్చరించారు కూడా. బైకునూ నిలిపేశారు. అయినా వీరు పోలీసులు ఆదమరవగానే వెళ్లారు. గల్లంతయ్యారు. ఈ ఘటన చిట్టమూరు మండలం కొత్తగుంట- మల్లాం మార్గంలోని బాలచంద్రారెడ్డి ఎస్టేట్ సమీపాన చెప్టా వద్ద, రొయ్యల వాగు సమీపంలో చోటు చేసుకుంది. కోట మండలం జరుగుమల్లి గ్రామానికి చెందిన.. ప్రస్తుతం అత్తగారి ఊరైన బుచ్చిలో స్థిరపడి.. చిట్టమూరు కొత్తగుంట వద్ద చికెన్‌షాపులో మేనేజరుగా పనిచేస్తున్న వేణుంబాక మధుసూదన్‌రెడ్డి(45), ఇదే షాపులో పనిచేసే జార్ఖండ్‌కు చెందిన ఎండీ షారుక్(23) నీళ్లలో పడిపోయారు. మధుసూదన్‌రెడ్డి కొట్టుకుపోగా.. చెట్టును పట్టుకున్న షారుక్ అతడిని రక్షించడానికి సెల్‌ఫోనును ఆ చెట్టుపై పెట్టి వాగులో దూకారు. ఈ క్రమంలో ఈయనా గల్లంతయ్యారు. ఈ విషయం తెలిసి ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దారు ప్రసాద్, సీఐ హుస్సేన్ బాషా, ఎస్ఐ చిన్న బలరామయ్య, వాకాడు ఎస్ఐ నాగబాబు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. కోట ఫైర్ ఇంజన్ సిబ్బందితో గాలించినా ఫలితం లేకపోవడంతో జాలర్లను తీసుకొచ్చి వలల సాయంతో వెదికారు. మధుసూదన్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం కొరకు బాలిరెడ్డిపాళెం ఆసుపత్రికి తరలించారు. గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి అదనపు ఎస్పీ మనోహరాచారి సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. చీకటి పడడంతో షారూక్ ఆచూకీని గుర్తించలేరు. పోలీసుల మాట పెడచెవిన పెట్టడంవల్లే ఈ దురదృష్టకర సంఘటన జరిగిందని అధికారులు అంటున్నారు.



మధుసూదన్‌రెడ్డి - షారూక్ (ఫైల్ ఫొటోలు)

ఆనందమానందమాయె

- శ్రీవారి దర్శనంపై స్థానికుల హర్షాతిరేకం



స్లాటెడ్ భక్తులతో కలిసి వెళుతున్న స్థానికులు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ పుట్టి, పెరిగి స్వామినే నమ్ముకుని జీవిస్తున్న మాకు ప్రత్యేక గౌరవానిచ్చేలా దర్శనాన్ని కల్పించిన టీటీడీకి రుణపడి ఉంటామంటూ స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. తిరుమల, తిరుపతి రూరల్, అర్బన్, చంద్రగిరి, రేణిగుంట మండలాల ప్రజలకు సోమవారం ఉదయం తిరుపతిలో 2,500, తిరుమలలో 403 టోకెన్లు జారీ చేశారు. మంగళవారం ఉదయం 4 గంటల స్లాట్ నుంచి సాయంత్రం 6 గంటల స్లాట్ వరకున్న టోకెన్లతో వీరు శ్రీవారిని దర్శించుకున్నారు. దివ్యదర్శన క్యూలో వెళ్లిన వీరికి ఇతర భక్తులకులాగే ఓ లడ్డూను ఉచితంగా అందజేశారు.

53 నిమిషాల్లోనే దర్శనం

మేము 53 నిమిషాల్లోనే క్యూలైన్‌లోకి వెళ్లి దర్శనం పూర్తిచేసుకుని బయటకు వచ్చేశాం. ఇంత త్వరగా దర్శనం అయిపోతుందనుకోలేదు. లోపల కూడా మమల్ని నెట్టలేదు. మంచి దర్శనం దొరికింది. చాలా ఆనందంగా ఉంది.

\- సుమతి



ప్రభుత్వం, టీటీడీ రుణం తీర్చుకోలేం

స్థానికులకు ప్రత్యేక దర్శనాన్ని కల్పించిన ప్రభుత్వం, టీటీడీ రుణం తీర్చుకోలేం. ఈ దర్శనాన్ని మళ్లీ తిరిగి ప్రారంభిస్తారనుకోలేదు. స్వామిని దర్శించుకునే అవకాశం కల్పించిన అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు.

\- గీత



స్థానికులుగా గర్వపడుతున్నాం

మాకు ప్రత్యేక గుర్తింపునిచ్చి స్థానికుల దర్శన కోటాలో దర్శనం చేయించడం చాలా సంతోషంగా ఉంది. మాకు ఇచ్చిన ఈ గౌరవానికి గర్వపడుతున్నాం. సుపథం నుంచి స్థానికులను అనుమతించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

\- శ్రీదేవి



సిబ్బంది దురుసుతనం

స్లాట్ కంటే ముందుగా వచ్చామని సిబ్బంది అనుమతించకపోగా దురుసుగా మాట్లాడుతున్నారు. స్థానికులను ఇతర భక్తులతో కలిపి అనుమతిస్తున్నారు. ప్రత్యేకంగా పంపాలని కోరుతున్నాం.

\- శ్రీనివాసమూర్తి



ఎస్వీయూలో కొనసాగుతున్న ఉద్రిక్తత
- అన్యమత ప్రచారం.. ప్రొఫెసర్‌పై దాడితో ఉన్నతాధికారుల సీరియస్
- నలుగురితో విచారణ కమిటీ

6లో



తిరుమల ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండో ఘాట్‌లో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. వారంరోజులుగా కురిసిన వర్షాలతో కొండలు నానిపోయిన క్రమంలో హరిణిషెడ్ సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ సమయంలో వాహనాలేవీ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. టీటీడీ ఫారెస్ట్, విజిలెన్స్, ఇంజనీరింగ్ అధికారులు పొక్లయినర్లు, ట్రాక్టర్లతో ఘటనా ప్రాంతానికి చేరుకుని చెట్లు, రాళ్లను తొలగించి వాహనాలను అనుమతించారు. బండరాళ్లు, మట్టి, చెట్లకొమ్మలను సాయంత్రానికి తొలగించారు. మరికొన్ని ప్రాంతాల్లోనూ కొండచరియలు విరిగిపడే అవకాశముందని అధికారులు అంచనావేసి నిఘా పెట్టారు.



కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో అంబరాన్నంటాయి. మంగళవారం ఉదయం అమ్మవారు కాళీయమర్ధనుడి అలంకారంలో సర్వభూపాల వాహనాన్ని అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయంత్రం 4.15 గంటలకు సర్వతేజోమయమైన అమ్మవారు బంగారురథంపై శ్రీమహాలక్ష్మి రూపాన్ని ధరించి తిరుమాడవీధుల్లో విహరించారు. స్వర్ణరథాన్ని లాగేందుకు మహిళలు పోటీపడ్డారు. రాత్రి శ్రీవారికి ఇష్టమైన గరుడుడు అమ్మవారికి వాహనంగా మారారు. శ్రీమహావిష్ణువు రూపంలో గరుడవాహనంపై అమ్మవారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 12 కళా బృందాల ప్రదర్శనలు వాహనసేవల్లో భక్తులను అలరించాయి.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

అలమేలుమంగ.. అభయమీయంగ!













శ్రీవారి పాదాల ఊరేగింపు

గరుడోత్సవంలో అమ్మవారికి శ్రీవారి పాదాలను అలంకరించడం ఆనవాయితీ. తిరుమల ఆలయం నుంచి స్వామివారి స్వర్ణపాదుకలను మంగళవారం ఉదయం 11 గంటలకు తిరుచానూరులోని పసుపు మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదాలను తిరువీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. రాత్రి పద్మావతి అమ్మవారు స్వామివారి పాదాలు ధరించి గరుడసేవలో తరించారు. ఈ కార్యక్రమాల్లో ఉడిపిలోని పెజావర్ మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థ స్వామి, టీటీడీ సభ్యులు జంగా కృష్ణమూర్తి, భానుప్రకాశ్‌రెడ్డి, ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, అర్చకులు శ్రీనివాసచార్యులు, బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు: సూర్యప్రభ వాహనం

మధ్యాహ్నం 12 గంటలకు: స్నపన తిరుమంజనం

రాత్రి 7 గంటలకు: చంద్రప్రభ వాహనం



ఉపాధ్యాయుడి బదిలీపై రోడ్డెక్కిన 'ఏకలవ్య' విద్యార్థులు

- పోలీసుస్టేషన్, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా
- సొమ్మసిల్లిన ఇద్దరు బాలికలు
- విచారణ చేపట్టిన అధికారులు



పోలీసుస్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కనమనంబేడులోని ఏకలవ్య గురుకుల పాఠశాల సైన్సు టీచరు సుమన్‌ను బదిలీ చేయడంపై విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించి పోలీసుస్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. సుమన్‌ను ఉద్దేశపూర్వకంగా ప్రిన్సిపాల్, వార్డెన్లు మార్పించారన్నారు. ఇంటర్ పరీక్షలకు రెండు నెలల ముందు సైన్సు ఉపాధ్యాయుడిని బదిలీ చేయిస్తే తమ చదువులు దెబ్బతింటాయన్నారు. బదిలీని రద్దు చేసే వరకు ధర్నా విరమించమని భీష్మించారు. ఉదయం టిఫిన్ చేయకుండా ధర్నాలో పాల్గొనడంతో ఇద్దరు విద్యార్థినులు స్పృహ కోల్పోయారు. ఎంఈవో రవీంద్రనాథ్ విద్యార్థులను సముదాయించారు. బదిలీపై విచారణ చేపడతామని చెప్పడంతో ధర్నా విరమించారు. కాగా, ఉపాధ్యాయుడి బదిలీ విషయంపై ఐటీడీఏ పీవో పరిమళ, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం విచారణ చేపట్టారు. సుమన్ ప్రవర్తనపై, వైఖరిపై విద్యార్థులను విచారించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి బదిలీ నిలుపుదలకు ప్రయత్నిస్తామన్నారు.



ఏకలవ్య గురుకులంలో విచారిస్తున్న అధికారులు

అందరినీ ఒక్కసారిగా వదలడంతో..!

- ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట
- నిర్లక్ష్యంగా వ్యవహరించిన విజిలెన్స్



ఏటీజీహెచ్ వద్ద భక్తుల మధ్య తోపులాట





దగ్గరుండి క్యూలైన్‌లోకి భక్తులను పంపుతున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏటీజీహెచ్‌లో టైంస్లాట్ భక్తుల మధ్య మంగళవారం తోపులాట జరిగింది. విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని తెలుస్తోంది. మహిళలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఆగచాట్లు పడ్డారు. స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు (ఎస్‌ఎస్‌డీ) పొందిన భక్తులను తిరుమలలోని ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్దనున్న ఏటీజీహెచ్ కాటేజీ వద్దనున్న క్యూలైన్లలోకి అనుమతిస్తారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ ఉండటంతో చాలా మంది భక్తులు ఎంబీసీ రోడ్డు వద్ద గుంపుగా చేరిపోయారు. వీరిని స్లాట్ల వారీగా క్యూలైన్‌లోకి అనుమతించాలి. వివిధ స్లాట్లలో ఉన్న భక్తులను వేరుచేయలేక విజిలెన్స్ అధికారులు, సిబ్బంది అందరినీ వదిలారు. భక్తులందరూ ఒక్కసారిగా ముందుకు దూసుకొచ్చారు. చిన్నపాటి వెడల్పుతో ఉన్న ప్రవేశమార్గాల్లో ముందుకు వెళ్లే క్రమంలో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు ఇలా ఒకరినొకరు నెట్టుకోవడంతో చిన్నారులు, మహిళలు పెద్దగా కేకలు వేశారు. పైగా ప్రవేశమార్గాల్లో, క్యూలైన్ల నిర్వహణ బాధ్యతలను శ్రీవారి సేవకులకు అప్పగించడంతో తోపులాటను అదుపుచేయడం వీరికి సాధ్యం కాలేదు. ఇంతమంది అధికారులు, సిబ్బంది ఉండి కూడా ఇలాంటి నిర్లక్ష్యం ఏంటంటూ భక్తులు ఆగ్రహించారు. ఆ సమయంలో సర్వదర్శనం క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాలనే ఉద్దేశ్యంతో టీటీడీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఏటీజీహెచ్ వద్దకు చేరుకున్నారు. భక్తుల మధ్య తోపులాటను చూసిన ఆయన అధికారులతో పాటు చైర్మన్ బీఆర్ నాయుడికి సమాచారమిచ్చారు. దీంతో చైర్మన్ వెంటనే అక్కడికి చేరుకుని వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఏవీఎస్వో, వీఐ ఇతర అధికారులను పిలిపించి తోపులాటలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దగ్గరుండి నెమ్మదిగా భక్తులను ముందుకు పంపడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

ఎస్వీయూలో ఉద్రిక్తత

- అన్యమత ప్రచారం.. ప్రొఫెసర్‌పై దాడి ఘటనలతో ఉన్నతాధికారుల సీరియస్
- తక్షణ విచారణకు నలుగురితో కమిటీ
- పోలీసు విచారణా చేపట్టాలని నిర్ణయం
- దళిత సంఘాలు, ఏబీవీపీ పోటాపోటీ ఆందోళనలు



వీసీ, రిజిస్ట్రార్లకు విన్నవిస్తున్న ఏబీవీపీ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం తలెత్తిన అన్యమత ప్రచార వివాదం నేపథ్యంలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. ఇటు అన్యమత ప్రచారం.. అటు ప్రొఫెసర్‌పై దాడి వ్యవహారాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. మంగళవారం ఉదయాన్నే ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సమావేశమయ్యారు. ఈ ఘటనలపై విచారణకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధారాణి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్నారు. సభ్యులుగా ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసయ్య, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లను నియమించారు. మరోవైపు వర్సిటీలో అన్యమత ప్రచారానికి పాల్పడిన ప్రొఫెసర్ చెంగయ్యపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పూజారి రాఘవేంద్ర, నాయకులు సురేంద్ర, పవన్, ఈశ్వర్, నందకిషోర్ తదితరులు ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. వర్సిటీలో మత విద్వేషాలకు చోటివ్వకూడదని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, టీఎన్ఎస్ఎఫ్, జీఎన్ఎస్, బీసీ యూనియన్‌ల నాయకులు అక్బర్, చిన్న, రవి, ఆర్కే నాయుడు, రామ్మోహన్, అశోక్, మల్లికార్జున, శివశంకర్‌నాయక్, మహేంద్రనాయక్ తదితరులు ఇన్‌చార్జి వీసీ అప్పారావుకు ఉమ్మడిగా వినతిపత్రం అందజేశారు. బయటి వ్యక్తులు ప్రొఫెసర్‌పై దాడి చేయడం వర్సిటీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. మత సంబంధమైన ఎలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకూడదని కోరారు. ఇక, దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై దాడి అమానుషమంటూ పలు దళిత విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు పరిపాలనా భవనం ముందు నిరసన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రేమ్‌కుమార్, అమృతతేజ, సుధాకర్, యుగంధర్, సుబ్రమణ్యం, సుందర్, సదాశివ డిమాండు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మొహరించాయి. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.



పరిపాలనా భవనం వద్ద బైఠాయించిన దళిత సంఘాల నేతలు

శ్రీవారి సేవలో సుచిత్ర ఎల్లా దంపతులు



తిరుమల, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): భారత్ బయోటెక్ చైర్మన్ కృష్ణ ఎల్లా, ఆయన సతీమణి, బోర్డు సభ్యురాలు సుచిత్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్న వారికి వేదపండితులు ఆశీర్వచనం చేశారు.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ దస్తావేజులు

- రేణిగుంటలో అన్ని రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్నామన్న అదనపు ఐజీ

రేణిగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్‌కు అవసరమైన దస్తావేజు తయారు చేసే విధానం ఆన్‌లైన్‌లో ఉందని, దాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రేషన్ శాఖ అదనపు ఐజీ ఉదయ్‌భాస్కర్ చెప్పారు. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రెండో రోజైన మంగళవారం కూడా రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ జరిగి పెండింగ్‌లో ఉన్న, రిలీజ్‌కాని పత్రాలను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని త్వరలో పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే అవినీతిపై ఆన్‌లైన్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.



ఏఐజీ ఉదయభాస్కర్

రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయండి

- కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్టు పనులకు తిరుపతి, రేణిగుంట రైల్వే బైపాస్‌రోడ్డు తదితరాలకు సంబంధించిన భూ సంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పురోగతిపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, పీడీ వెంకటేష్, ఎంకే చౌదరి, రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్‌లైన్ ఫ్యాక్టరీ స్థలాల పరిశీలన



సాల్ట్ లైన్ ఫ్యాక్టరీ స్థలాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా

వాకాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగరాజపట్నం గ్రామంలో నూతనంగా ప్రారంభించనున్న సాల్ట్‌లైన్ ఫ్యాక్టరీ స్థలాన్ని మంగళ వారం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. సాల్ట్ లైన్ ఫ్యాక్టరీకి సంబంధించి స్థలాలకు హద్దులను చూపించాలని పరిశ్రమ నిర్వాహకులు కోరడంతో పరిశీలిల చేపట్టామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు రామయ్య, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంబలేరు చప్టాపై తగ్గిన వరద నీరు



పంబలేరు చప్టాపై రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం కురిసిన భారీ వర్షాలతో పంబలేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో చప్టాపై రెండు రోజులు పాటు రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి తగ్గడంతో మంగళవారం యధావిధవిగా రాకపోకలు కొనసాగాయి. పైప్రాంతాల నుంచి వరద నీరు పంపలేరు వాగుకు చేరుకోవడంతో పంబలేరు చప్టాపై మూడు అడుగులు మేర నీటి ప్రవాహం పెరగడంతో ఎటువంటి ప్రమాదాలు చోటు చేసుకుండా అధికారులు రెండు రోజులు క్రితం రాకపోకలు నిలిపివేశారు.

ఉప్పు భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి, తహసీల్దారు శరత్‌బాబు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తడ కండ్రిగ పరిధిలోని ఉప్పు భూములను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి మంగళవారం పరిశీలించారు. తడకండ్రిగ సర్వే నెంబరు 171లో ఉన్న సుమారు 264 ఎకరాల ఉప్పు భూములను పరిశీలించి వాటి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శరత్‌బాబు, సర్వేయర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు రైల్వే యూనియన్ ఎన్నికలు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సదరన్ రైల్వేలో గుర్తింపు పొందిన యూనియన్లకు బుధ, గురువారాల్లో ఎన్నికలు జరగనున్నాయి. సూళ్లూరుపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరింగ్ కార్యాలయం, నాయుడుపేట రైల్వే స్టేషన్‌లోని కార్యాలయంలో ఎన్నికలకు ఏర్పాట్లు చేశారు. సూళ్లూరుపేట పరిధిలో 376 మంది, నాయుడుపేట పరిధిలో 274 మంది రైల్వే ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు. సదరన్ రైల్వే పరిధి లోని 5 యూనియన్లు పోటీ పడుతున్నాయి. రెండు రోజులపాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహిం చేందుకు రైల్వే ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు.

పోలీస్‌స్టేషన్లలో ఎస్పీ తనిఖీలు



పెళ్లకూరులో పోలీస్ స్టేషన్‌లో
రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

పెళ్లకూరు, దొరవారిసత్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. స్టేషన్ ఆవరణలోని అన్ని గదులను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నేరాలను నియంత్రించేందుకు కృషి చేయాలని ఎస్ఐ నాగ రాజుకు సూచించారు. అలాగే దొరవారిసత్రం పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ అజేయ్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

వైసీపీ అధికార ప్రతినిధి రాజీనామా

బాలయపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలయపల్లి మండలం వైఎసీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి రావి దేవికాచౌదరి తన పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు మంగళవారం ప్రకటించారు. తన రాజీనామా పత్రాన్ని పార్టీ అధినేత జగన్‌కు పంపి నట్లు తెలిపారు. వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేశానని, రాజకీయ భవిష్యత్తు త్వరలో నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు.

జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు

సూళ్లూరుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు చేస్తున్నారు. వర్షానికి గుంతలమ యంగా మారిన రోడ్డును బాగు చేసేందుకు అధికారులు చర్యలు చేప ట్టారు. రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి హోలీక్రాస్ కూడలి వరకు ఎక్స్‌కవేటర్ సాయంతో చదును చేసి కంకర తోలి గుంతలు పూడ్చుతున్నారు.



జీఎన్‌టీ రోడ్డులో గుంతలు పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణీరెడ్డి

వాకాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించి పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీవో వాణిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షా సమావే శంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలన్నారు. అలాగే మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు వీధుల్లో నీరు నిల్వ ఉండ కుండా చూడాలన్నారు. అలాగే గ్రామాల్లో ఎన్‌పీసీఐ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఈవోపీఆర్‌డీ ఉమామహేశ్వర్‌రావు, పంచాయతీ కార్య దర్శులు, ఫిజికల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ట్యాంకుల్లో తాగునీటి శుద్ధి కోసం క్లోరిన్ ట్యాబ్లెట్లు

దక్కిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో తాగునీరు కలు షితం కాకుండా అన్ని ట్యాంకులను క్లోరిన్ ట్యాబ్లెట్ల ద్వారా శుద్ధి చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పరిసరా ల శుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ట్యాంకుల్లో క్లోరిన్ ట్యాబ్లెట్లు ఉపయోగించడం వల్ల తాగునీరు శుద్ధి చేయ డం జరుగుతుందన్నారు. నెలలో రెండు దఫాలు విధిగా ట్యాంకుల్లో క్లోరిన్ ట్యాబ్లెట్లు కలపాలని పంచాయతీ కార్యదర్శలకు సూచించారు. ఈవోపీఆర్డీ అ ల్లాభక్షు మాట్లాడుతూ వర్షాల వల్ల తాగునీరు కలుషితం అయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా అంటురోగాలను నివా రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

తడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందజేస్తోందని, దానిని ఆసరాగా చేసుకొని ఎవరైనా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంజాయి, ఇసుక అక్రమ రవాణా చేసేవారి గురించి పోలీసులకు వివరాలు అందజేయాలని, సమాచారం అందించిన వ్యక్తి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండప్ప నాయుడు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి



కోటలో దివ్యాంగులకు బహుమతులు, పండ్లు పంపిణీ చేస్తున్న
జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్

గూడూరు, కోట, చిల్లకూరు, సూళ్లూరుపేట, తడ, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అంగవైకల్యం శరీరానికే కానీ, మనస్సుకు కాదని, దివ్యాంగులు అధైర్య పడకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలని రెడ్ సంస్థ గౌరవ అధ్యక్షుడు మనపాటి రవీంద్రబాబు అన్నారు. మంగళవారం గూడూరులోని షాదీ మంజిల్‌లో రిహబిలిటేషన్, ఎడ్యుకేషన్ ఫర్ డిజేబుల్డ్(రెడ్) సంస్థ ఆధ్వ ర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కల్గిన వారు ఎందులోనూ తక్కువ కాదని, పట్టుదలతో శ్రమస్తే దేనినైనా సాధ్యం చేయవచ్చునన్నారు. అనం తరం దివ్యాంగులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహు మతులు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ షరీనా, రైల్వే కమర్షియల్ అధికారి వెంకటేశ్వర్లు, మయూరి శ్యాం యాదవ్, అడవ పార్వతయ్య, మహబూబ్ బాషా, నయోమి, జానా సుధీర్, రాజేష్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు. ● కోటలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరి గింది. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రేమ, ఆదరాభిమానాలు చూపాలన్నారు. చదువుకు అంగవైకల్యం అడ్డుకాదని, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు శైలజ, మస్తానయ్య, ఎంపీడీవో వేణు, పల్లవి, ప్రసాద్, శాంతి, రేణుక, తదితరులు పాల్గొన్నారు. ● చిల్లకూరు మండలంలోని పారిచర్ల పాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిం చారు. హెచ్ఎం సుధాకర్, చంద్ర, మాదవయ్య, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, మంజూశ్రీ, వివి కుమార్, షకీల తదితరులు పాల్గొన్నారు. ● సూళ్లూరు పేటలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. విద్యా ర్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆచార్య భరద్వాజ సేవాసంస్థ నిర్వాహకులు విద్యార్థులకు పుస్తకాలతో పాటు విద్యా సామగ్రిని అందజేశారు. ఎంఈవోలు శ్రీనివాసులు, శీనయ్య, భవిత ఉపాధ్యా యురాలు భార్గవి, ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు లలిత, ఉపాధ్యా యులు సాయిసంధ్య, రమ, ఉషా, మురళి తదితరులు పాల్గొన్నారు. ● తడలోని భవిత కేంద్రంలో ఎంఈవో మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రతి భావంతుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సురేష్, శ్రీనివాసులు, ఫిజియోథెరపిస్టు శిరీషా, ఉపాధ్యాయులు ప్రియాంక, కల్పన తదితరులు పాల్గొన్నారు.

డ్రం సీడర్ వినియోగంతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ నాగర్జున సాగర్

వెంకటగిరిటౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): డ్రం సీడర్ వినియో గంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ నాగర్జున సాగర్ అన్నారు. మంగళవారం స్థానిక సీసీ కండ్రిగలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్రాలతో వరి విత్తనాలు చల్లడం వల్ల ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. అలాగే ఈ-పంట నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం పశువుల్లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కురుగొండ, బత్తలాపురంలో 'పొలం పిలుస్తోంది'

ఓజిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండ, బత్తలాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో విజయలక్ష్మి రైతులకు సూచనలు ఇచ్చారు. నారుమళ్ల పెంపకం, ఎరువులు, పురుగు మందుల వాడకం వంటి అంశాల గురించి వివరించారు.

ఈ క్రాప్ నమోదుపై శిక్షణ



గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇస్తున్న ఏవో ప్రవీణ

పెళ్లకూరు, డిశంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామ సచివాలయంలో మంగళవారం ఈ క్రాప్ నమోదుపై వీఏఏలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి గొడవర్తి ప్రవీణ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదుతో రైతులు సాగు చేస్తున్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీలేని పంట రుణాలు, రాయితీపై వ్యవసాయ పరికరాలతో పాటు ఇతర పథకాలు రైతులకు అందుతాయనన్నారు. పంటల బీమా పథకం కింద రైతు వాటా వరికి రూ.630 ఈనెల 31లోగా, వేరుశనగ పంటకు రూ.615 ఈనెల 15లోగా చెల్లించాలని ఏవో తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు చందు, దినేష్, శ్రీరాములు, ప్రదీప్‌కా, రాజేష్, మణి, తదితరులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఏ సాగరం పరిధిలోని రాఘవరెడ్డి చెరువును కొందరు ఆక్రమించు కుంటున్నారని తహసీల్దారుకు రైతులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారుల చెరనుంచి చెరువును కాపాడాలని కోరారు.

హైవేలో వంతెనల పరిశీలన

వెంకటగిరి టౌన్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు - పెంచలకోన జాతీయ రహదారిలో ఉన్న పలు వంతెనలను హైవే అధికారులు మంగళవారం పరిశీలించారు. వంతెనల నాణ్యత, పరిమాణాలను లెక్కించి ఉన్నాతాధికారులకు నివేదిక పంపిస్తున్నామని హైవే అధికారి సుధాకర్ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ

తడ, ఓజిలి, నాయుడుపేట, కోట, వాకాడు, దొరవారిసత్రం, పెళ్లకూరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై తడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ డీఈ శ్రీధర్, ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సి జాగ్రత్తలు, ఓటర్ల జాబితా, ఎన్నికల నిర్వహణ వంటి విషయాల గురించి శిక్షణ ఇచ్చారు. ఇరిగేషన్ ఏఈ మస్తానయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఓజిలిలో ఎంపీడీవో విజయలక్ష్మి, నీటిపారుదలశాఖ ఏఈ వీరాస్వామి, నాయుడుపేటలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఇన్‌చార్జి తహసీల్దారు రాజేంద్ర, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, కోటలో తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, ఎంపీడీవో వేణు, వాకాడులోని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు, ఎంపీడీవో అన్నపూర్ణరావు, తహసీల్దారు రామయ్య, దొరవారిసత్రంలో తహసీల్దార్ శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఇరిగేషన్ ఏఈ హరికృష్ణ, పెళ్లకూరులో తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఇరిగేషన్ ఏఈ సుబ్బరావు ఆధ్వర్యంలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు, దుప్పట్ల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసరాలు అందజేస్తున్న రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యులు

గూడూరు, డిసెంబరు 3,(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగులు దినోత్సవం సందర్భంగా రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎల్లసిరి గోపాల్ రెడ్డి దాతృత్వంతో దివ్యాంగులకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, శ్రీకంఠి రామ మోహన్ రావు మాట్లాడుతూ దివ్యాంగులు నిరుత్సాహ పడ కుండా ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాశిన నాగులు, ధనుంజయ రెడ్డి, సిద్ధారెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, కృష్ణ, సనత్‌కుమార్ రెడ్డి, గిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

జియో ట్యాగింగ్‌పై అవగాహన కల్పించాలి

కోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జియో ట్యాగింగ్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వాణీరెడ్డి కోరారు. మండల పరిధిలోని కేశవరం, కోటలోని పలు సచివాలయాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. జియో ట్యాగింగ్ చేసే విధానంపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని 21 పంచాయతీల్లో ఔట్‌హోల్డ్ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో డాక్టర్ మైథిలి, రమణ బాబు దాతృత్వంలో అన్నదానం చేశారు.

